ప్రజాశక్తి
విశాఖపట్నం
గురువారం
జనవరి 04
2018
12 పేజీలు


సెజ్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి బాలరాజు

పెద్దలపై చర్యలేవి?

- సెటిల్‌మెంట్ బ్యాచ్‌ను వదిలేసిన పోలీసులు
- గిరిజన బాలికపై రేప్ కేసులో ముగ్గురు అరెస్టు
- అందరినీ అరెస్టు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్


ఎస్ఇజెడ్ ముఖద్వారం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి
అభం శుభం తెలియని గిరిజన మూగ బాలికపై అత్యాచారం చేసిన నిందుతుడ్ని పోలీసులు పట్టుకున్నా, బాలిక శీలానికి వెల కట్టి వారి మధ్య రాజీ కుదర్చడానికి రూ. 25వేలు తీసుకోవడమే కాకుండా ఈ కేసులో కీలక పాత్ర పోషించిన ఎస్ఇజెడ్‌లోని హెచ్‌బిఎల్ అధికారులను పోలీసులు అరెస్టులు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం కేసును నీరుగార్చాలనే ఉద్దేశంతోనే అక్కడ అధికారుల జోలికి పోలీసులు వెళ్లడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

దువ్వాడ ఎస్ఈజెడ్‌లో మూగబాలికపై గత శనివారం అత్యాచారం చేసిన నిందితుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన డ్రైవర్ సిహెచ్ విశ్వనాథ్‌తోపాటు బస్ యజమాని మువ్వల అప్పలరాజు, సెక్యూరిటీ అధికారి ఎం.సూర్య ప్రకాశరావును మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అత్యాచారానికి సంబంధించిన సెటిల్మెంట్ మొత్తం హెచ్‌బిఎల్ కంపెనీ పరిపాలనా విభాగంలోనే జరిగింది. లక్ష రూపాయలకు ఒప్పందం కుదిర్చిన హెచ్‌బిఎల్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఆమె వద్ద నుంచి కమీషన్ రూపంలో

రూ.25వేలు తీసుకుని న్యూ ఇయర్ పార్టీ చేసుకున్నారు. నిజానికి సెక్యూరిటీ అధికారి కంటే ఈ విషయంలో హెచ్‌బిఎల్ అధికారులదే ఎక్కువ పాత్ర అని తెలిసినా పోలీసులు వారిపై దృష్టి సారించలేదు. బాధితురాలు తమ్ముడు ఫిర్యాదు చేయడంతో

మిగతా 4లో..

గిరిజన మూగ బాలికపై అత్యాచారం హేయం

దువ్వాడ సెజ్ గేటు వద్ద ప్రజా సంఘాల ఆందోళన

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - కూర్మన్నపాలెం
దువ్వాడ సెజ్‌లో అత్యంత అమానవీయంగా గిరిజన మూగ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ సెజ్ గేటు వద్ద వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ సెజ్‌లో హెచ్‌బిఎల్ కంపెనీలో పని చేస్తున్న బాలికపై అదే కంపెనీ బస్సు డ్రైవర్ వాహనంలోనే అత్యాచారం చేసి దారుణంగా హింసించాడన్నారు. ఈ ఘటన గురించి సెజ్ యాజమాన్యానికీ, సెక్యూరిటీ సిబ్బందికీ తెలిసినా కప్పిపుచ్చేందుకు పూనుకోవడం దారుణమన్నారు. రూ.లక్ష ఇచ్చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కేసును పక్కదారి పట్టించేందుకు కంపెనీ యాజమాన్యం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ అమానవీయ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు పృధ్వీరాజ్, వరలక్ష్మి మాట్లాడుతూ అత్యాచార నిందితునిపై నిర్భయ, వికలాంగుల చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలికి మెరుగైన

మిగతా 4లో..



సుబ్బారావు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

12లో

గొప్ప హేతువాది సుబ్బారావు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు

ఐదు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

తొలిదశలో 754 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి
జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారయ్యాయి. రెండు దశల్లో ఈ పార్కుల ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమిని సిద్ధం చేయనుంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) చేతిలోనున్న భూములతో పాటు ప్రభుత్వ భూములను ఈ పార్కుల ఏర్పాటుకు సిద్ధం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ ఆలోచనలకు తగినట్లు ఎంఎస్ఎంఇ పార్కులను ఏ నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి జిల్లా పరిశ్రమల కేంద్రం పంపింది. తొలి దశలో నర్సీపట్నం, భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 754.73 ఎకరాల్లో పార్కులు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని పారిశ్రామికవేత్తలకు ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తే పెట్టుబడులను ఆకర్షించడం సులువు అతుందన్న ఆలోచనలో ఉంది. సెజ్‌కు సేకరించిన భూముల్లో పూర్తిస్థాయిల్లో పరిశ్రమలు రాకపోవడంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులను రాబెట్టుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.


పార్కులకు కేటాయించిన స్థలం

నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలం రాచపల్లిలో 104.74 ఎకరాలు, భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం మండలంలో పెంట, అనంతవరంలో

మిగతా 4లో..


జి.మాడుగుల మండలంలో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

జన్మభూమిలో కొనసాగిన నిలదీతలు

వార్తలు లోపల పేజీలో..

'జన్మభూమి'లో కొనసాగుతున్న నిలదీతలు



పాడేరులో రోడ్డుపై బైఠాయించి గిరిజనం

జి.మాడుగుల : సొలభం, గడుతూరు, వంతాల, పెదలోచలి పంచాయతీ కేంద్రాల్లో జన్మభూమి నిర్వహణకు వెళ్తున్న అధికారులను దేగలరాయి కూడలి వద్ద గిరిజనులంతా అడ్డుకుని, నిర్బంధించారు. గత జన్మభూమి హామీలను నెరవేర్చడం, కొత్తూరు నుంచి సొలభం రహదారి నిర్మాణం, ఇతర సమస్యలను పరిష్కరించాకే జన్మభూమి నిర్వహించాలని తేల్చిచెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అధికారులను రానివ్వలేదు. జి.మాడుగుల ఎస్ఐ శ్రీను గిరిజనులకు నచ్చజెప్పినా వారు పినిపించుకోలేదు. మండల ప్రత్యేక అధికారి శివశంకర్‌రెడ్డి వచ్చి రహదారి సమస్యపై ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామని చెప్పినా గిరిజనులు వినలేదు. జన్మభూమిని అడ్డుకుంటే కేసులు నమోదౌతాయని ఎంపిడిఒ ప్రేమాకర్ చెప్పడంతో ప్రజలు లేని సభలను నిర్వహించుకోండంటూ గిరిజనులు వెళ్లిపోయారు. సమస్య సద్దుమణిగిన తర్వాత ఎమ్మెల్యే జన్మభూమికి వచ్చారు. బిజెపి అరకు



జి.మాడుగులలో...

పార్లమెంట్ ఇన్‌ఛార్జి కురసా ఉమామహేశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఐసారం హనుమంతరావు, సర్పంచ్‌లు బొడిగి కృష్ణకుమారి, ఎంపిటిసి కల్యాణి, పాల్గొన్నారు.

పాడేరు రూరల్ :సమస్యలు పరిష్కరించలేని జన్మభూమి మాకొద్దంటూ వనుగుపల్లి గ్రామస్తులు నినాదాలు చేస్తూ కందమామిడి రహదారిపై బైఠాయించి ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అధికారులను అడ్డుకున్నారు. సమస్యలను పరిష్కరించని జన్మభూమితో సమయం వృథా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎమ్మెల్యే, అధికారులను నిర్బంధించారు. పాడేరు సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు సర్దిచెప్పినా వినకపోవడంతో ఎమ్మెల్యే కలుగజేసుకొని సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. మినుములూరు, డి.గొందూరు, ఇరడాపల్లి పంచాయతీల్లో సమస్యలపై గిరిజనులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సుందరరావు, ఎంఎం.శ్రీను, లక్కు, ఎంపిడిఒ మధుమోహన్‌కుమార్, తహశీల్దార్ దుర్గారవీంద్రనాథ్, ఎంఇఒ సరస్వతి, డిటి త్రినాథ్, పాల్గొన్నారు.

అరకు రూరల్ : చొంపి గ్రామసభలో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం నాయకులు ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర మరుగుదొడ్ల ,ఉపాధి బకాయిలపై అధికారులను నిలదీశారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని, పోడు భూములకు పట్టాలు అందించాలని కోరారు. బొండాం గ్రామసభలో కూడా సమస్యలపై తహశీల్దార్ అరుణను గిరిజనులు నిలదీశారు. ఎంపిడిఒ మల్లిఖార్జునరావు, చొంపి సర్పంచ్ పి.లక్ష్మి, ఉపసర్పంచ్ జి.సన్యాసమ్మ, పీసా కార్యదర్శి రాజ్‌కుమార్, గిరిజన సంఘం నాయకులు కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

అనంతగిరి : టోకూరు, గరుగుబిల్లి జన్మభూమి కార్యక్రమాల్లో ఇందిరమ్మ గృహాలు, పింఛన్లు, రేషన్ వంటి సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని గిరిజనులు అధికారులను నిలదీశారు. టోకూరు పంచాయతీ రాయివలస, పూలగుడ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి బిల్లులు చెల్లించలేదన్నారు. గరుగుబిలిలో రేషన్, చంద్రన్న కానుక, పింఛన్ వంటి వాటిపై అధికారులను నిలదీశారు. తహశీల్దార్ జయప్రకాష్, ఎంపిడిఒ రమేష్‌రామన్, ,ఎంఇఒ వెంకటరావు, పిఆర్ జెఇ మాణిక్యం, ఎపిఒ శ్రీనివాస్, ఎపిఎం శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పిఒ శారద, పంచాయతీ సర్పంచ్ సోమ, పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్పించొద్దంటూ అరమ పంచాయతీ సర్పంచ్ సుబ్బారావు ఆధ్వర్యాన గిరిజనులు తీర్మానం చేసి ఎపిడి లచ్చన్నకు తీర్మానపత్రాన్ని అందించారు. కండ్రూం పంచాయతీలో సర్పంచ్ కె.ఆనందరావు, గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి టి.సూర్యనారాయణ ఆధ్వర్యాన తీర్మానపత్రాన్ని తహశీల్దార్ బాబూసుందరానికి అందించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మీనాకుమారి, సర్పంచ్ సుబ్బారావు, కె.ఆనంద్, ఎంఇఒ త్రినాథ్‌రావు, తహశీల్దార్ బాబూసుందరం, పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : దారెల, బంగారుమెట్ట జన్మభూమి సభల్లో ఉపాధి బిల్లులు అరకొరగా చెల్లించకపోవడంపై గిరిజన సంఘం నాయకులు అధికారులను నిలదీశారు. గత జన్మభూమి సమస్యలను పరిష్కరించలేదని ప్రశ్నించారు. దీనిపై గిరిజన సంఘం నాయకులు పి.శాస్త్రిబాబు బిల్లులు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీనివ్వాలని డిమాండ్ చేయడంతో ఈ నెల 5లోగా ఇస్తామంటూ రాసిచ్చారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దంటూ జన్మభూమిలో తీర్మానించారు. ఎంపిపి వి.పద్మ, టిడిపి జాల్లా ఉపాధ్యక్షురాలు కె.పద్మ, టిడిపి మండల అధ్యక్షులు బలరాం, ఎంపిడిఒ ప్రభాకరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదబయలు రూరల్ : జన్మభూమిలో ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదనిలక్ష్మీపేట, బొండాపల్లి, పొయిపల్లి పంచాయతీల్లో గిరిజనులంతా ముక్తకంఠంతో అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎంపిపి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కమల జోక్యం చేసుకొని ఫిబ్రవరి నెలాఖరులోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం సిపిఎం, ఎపిజిఎస్ ఆధ్వర్యంలో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని, కొండకుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి త్రినాథ్, ఎంపిడిఒ వెంకన్నబాబు, ఎంపిపి ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు బూదన్న, కమల, తహశీల్దార్ సుధాకర్, ఎంఇఒ సింహాచలం, ఎపిజిఎస్ నాయకులు శరభన్న, రామారావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సింహాచలం, పాల్గొన్నారు.

హుకుంపేట : ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు కోరారు. ఓల్డా, రాప గ్రామాల్లో జన్మభూమిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రమూర్తి, ఎంఇఒ రామచంద్రరావు, సిడిపిఒ నాగమణి, సర్పంచ్ పుణ్యవతి, ఎంపిటిసి ధర్మయ్యదొర జెడ్‌పిటిసి వసంతకుమారి, టిడిపి నాయకులు, పలు శాఖల అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

జన్మభూమితో ఒరిగిందేమిటి : సిపిఎం

కె.కోటపాడు : జన్మభూమితో ప్రజలకు ఒరిగిందేమిటని సిపిఎం మండల నాయకులు ఇ.నాయుడుబాబు, యర్రా దేముడు, జి.చింతాలు విమర్శించారు. జన్మభూమి ఉత్తి బూటకమని, ప్రజలను మభ్యపెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం దీన్ని అమలు చేస్తోందన్నారు. సభల్లో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల తదితర సంక్షేమ పథకాలను అందించకుండా పాత పథకాలతోనే కాలం వెల్లదీయడం విచాకరమన్నారు.

చీడికాడలో...

తహశీల్దార్ భాగ్యవతి ఆధ్వర్యంలో మంచాల గ్రామంలో జన్మభూమి గ్రామసభలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవిప్రకాష్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ గ్రామంలోని కేంద్రానికి ప్రహరీ, విద్యుత్, తాగునీటి సదుపాయం లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇఒపిఆర్‌డి బి.చైతన్య, ఎఒ శ్యామ్‌ప్రసాద్, సర్పంచ్ కశిరెడ్డి కొండమ్మ, టిడిపి నాయకులు గండి ముసిలినాయుడు, ఎంఇఒ కె.గంగరాజు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చీడికాడలో...

రైతు రుణమాఫీ అమలులో లోపాలపై మంచాల మాజీ సర్పంచ్ యన్నంశెట్టి దేముడు



చీడికాడలో ప్రశ్నిస్తున్న సిపిఎం నేత

జన్మభూమిలో అధికారులను నిలదీశారు. మంచాల గదబూరుకు వెళ్లే మార్గంలో కాలువ వద్ద పెద్ద రంధ్రం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపిడిఒ గ్లాడ్స్ ఆధ్వర్యంలో తునివలస జన్మభూమి సభలో ఇంటిపాలెం గ్రామానికి రోడ్లు, నీరు, వైద్య సదుపాయాలు అందడం లేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపిపి కుచ్చు కళావతి, ఎంపిటిసి ఆర్‌వి సత్యనారాయణ, తహశీల్దార్ భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు. పోడు భూములను సర్వేచేసి గిరిజనులకు పట్టాలు ఇప్పించాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు మంచాలలో బుధవారం నిర్వహించిన జన్మభూమిలో తహశీల్దార్ పి.భాగ్యవతికి వినతిపత్రం అందించారు. మరుగుదొడ్ల అక్రమాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోనాం చోడవరం ఆర్అండ్‌బి రోడ్డుకు నిధులు కేటాయించి పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గత్తం జగ్గారావు, సిహెచ్ జగ్గారావు పాల్గొన్నారు.

చోడవరంలో...

మండలంలోని ముద్దుర్తి, గోవాడ, శేమునాపల్లి, గాంధీగ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు ప్రజల నిరసనల మధ్య కొనసాగాయి. ప్రజలకు పింఛన్లు, ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు అందివ్వకపోవడంతో సభల్లో పాల్గొన్న వారు అసహనం వ్యక్తం చేశారు. గాంధీగ్రామంలో ఇళ్ల మంజూరులో వివక్షపై అధికారులను దళితులు నిలదీశారు. సంక్షేమ పథకాలన్నీ అధికార పార్టీకే పోతున్నాయని ఎంపిటిసి అల్లం మాధవి భర్త రామఅప్పారావు అధికారులను నిలదీశారు. దీంతో కొంతసేపు సర్పంచ్ భర్త లక్ష్మణకుమార్ తదితరులకు వాగ్వాదం చోటు చేసుకుంది. మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కెవిఎస్ రవి, ఎంపిడిఒ జివి చిట్టిరాజులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వడ్డాదిలో...

బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, గంటికొర్లాం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి కేశవ్‌పాండే, వైస్ ఎంపిపి దాడి సూరినాగేశ్వరరావు, ఎంపిడిఒ టి.కొండలరావు, తహశీల్దార్ కెవివి శివ, ఎఒ సుబ్బలక్ష్మి, ఎఇఒ రూప, ఎపిఒ అప్పలరాజు, ఎలక్ట్రికల్ ఎఇ మహేష్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచులు తమరాన దాసు, బాలకృష్ణ, సుంకర రవికుమార్, ఎంపిటిసి దరిమిశెట్టి దేవి, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగులలో...

ప్రజల సమస్యల పరిష్కారానికి జన్మభూమి మంచి వేదిక అనిమండల ప్రత్యేకాధికారి శైలజ సాగరంలో నిర్వహించిన జన్మభూమి సభలో అన్నారు. సురవరం కస్తూర్బా గాంధీ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఇరిగేషన్, ఎఇలు భార్గవకుమార్, సత్యనారాయణ, సాగరం సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

అధికారులను నిలదీయడం, వాగ్వాదాలతో రెండోరోజు జన్మభూమి కొనసాగింది. ప్రారంభమైంది. మండలంలోని తామరబ్బ, చింతలపూడి, రైవాడ గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తామరబ్బలో సర్పంచులకు తెలియకుండా గ్రామాల్లో సాధికారమిత్ర గ్రూపులను ఎలా వేశారని అధికారులను ప్రతిపక్షానికి చెందిన కొంతమంది గిరిజనులు నిలదీశారు. జన్మభూమిలో పింఛన్లు ఇస్తామని ప్రకటనలు చేసి, తీరా త్వరలో అంటూ దాటేయడం అన్యాయమని వాపోయారు. కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శనలతో అధికారులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, జెడ్‌పిటిసి గాలి వరలక్ష్మి, ప్రత్యేక అధికారి జి.మహాలక్ష్మి, ఎంపిడిఒ డి.చంద్రశేఖర్, తహశీల్దార్ వైఎస్ నాగరాజు, ఎస్ఐ పి.నర్శింహమూర్తి, సర్పంచులు,



దుంబ్రిగుడలో తీర్మానం అందజేత

ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : ఎల్‌బిపి అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, గంటికొర్లాం గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి కేశవ్‌పాండే, ఎంపిడిఒ టి.కొండలరావు, తహశీల్దార్ కెవివి శివ, ఎఒ సుబ్బలక్ష్మి, ఎపిఒ అప్పలరాజు, ఎలక్ట్రికల్ ఎఇ మహేష్, విశాఖడెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచులు తమరాన దాసు, బాలకృష్ణ, సుంకర రవికుమార్, ఎంపిటిసి దరిమిశెట్టి దేవి, పాల్గొన్నారు.

కె.కోటపాడు : తాను వైసిపికి చెందిన సర్పంచ్‌ను అయినందునే తనపై జన్మభూమి కమిటీ పెత్తనం చెలాయిస్తుందని లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ అవుగడ్డ సోంబాబు జన్మభూమి సభలో అధికారులను నిలదీశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల సమాచారం సర్పంచ్‌నైన తనకు తెలియకుండానే అమలు చేస్తున్నారన్నారు.



ముంచంగిపుట్టులో...

గొండుపాలెం, లంకవానిపాలెం, పింద్రంగి, రొంగలినాయుడు పాలెం గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి డివి రమణమూర్తి పాల్గొన్నారు., గొండుపాలెం గ్రామసర్పంచ్ వంటాకు శ్రీను, తహశీల్దార్ బివి రాణి , వైస్ ఎంపిపి బండారు మంగపతి, సర్పంచులు రొంగలి సత్యవతి నాయుడు, టిడిపి నేత బండారు దేముడుబాబు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- మునగపాక

తిమ్మరాజుపేట గ్రామంలో విశాఖ డెయిరీ పాడి రైతులకు డెయిరీ సిఇఒ ఆనంద్ చేతుల మీదుగా బుధవారం సంక్రాంతి బోనస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 158 మంది రైతులకు 3లక్షల 68వేలు బోనస్ ఇచ్చినట్లు తెలిపారు. పాడి రైతులకు సుఖీభవ కార్డు తప్పని సరిగా తీయించే బాధ్యత సూపర్‌వైజర్‌పై ఉందని తెలిపారు. వీరి కోసం వడ్డీ లేని రుణంపై హర్యానా నుండి పాడి గేదెలను ఇస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మాజీ డైరెక్టర్ భీశెట్టి లక్ష్మణరావు, బిసి సెల్ అధ్యక్షుడు బీమరసెట్టి శ్రీనివాసరావు, మరియు డెయిరీ జెఇ నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు కొయిలాడ సూరిబాబు, పాడి రైతులు, పాలకవర్గం పాల్గొన్నారు.


బోనస్‌లు అందిస్తున్న డెయిరీ అధికారులు

గొలుగొండలో...

పాడిరైతులను సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయమని విశాఖడెయిరీ డైరెక్టర్ చిటికెల రాజకుమారి అన్నారు. బుదవారం మండలంలోని గైరంపేట, కన్నంపేట గ్రామాల్లో వున్న విశాఖ డయిరీ పాలసేకరణకేంద్రాల్లో పాడిరైతులకు బోనస్సులను, పశుదాణా గిన్నెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిరైతుల శ్రేయస్సు కోసం ఏడాదిలో 4సార్లు బోనస్సులను, వడ్డీరాయితీపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పాడి రైతులకు వైద్యసదుపాయం, వారి కుటుంబంలోని విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 65 మంది రైతులకు రూ.లక్షా 65 వేలు బోనస్సులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గైరంపేట పాల సేకరణ కేంద్రం అధ్యక్షురాలు శీనరెడ్డి వరలక్ష్మి, నర్సీపట్నం ఏరియా మేనేజరు సత్యనారాయణ, పాలసేకరణ కేంద్రం సెక్రటరీ మిడతాన సూరిబాబు, రూటు సూపర్‌వైజర్ గంగేష్‌లుతో పాటుగా పలువురు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నాతవరం : మండలంలో మర్రిపాలెం పంచాయితీ ఎల్లవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఎస్.ఐ అశోక్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం చీడిపల్లి రామకృష్ణ, చిడిపల్లి స్వామి పనిముగించుకోని ఇంటికి చెరారన్నారు. భోజనం చేసిన తర్వాత యర్రవరంలోని బందువులు ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరి మర్రిపాలెం గ్రామంలోని టెలిఫోన్ స్థంబాన్ని ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు స్వామి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. రామకృష్ణను నర్సీపట్నం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుదవారం ఉదయం మృతిచెందాడని అన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చెస్తున్నట్లు తెలిపారు.

నేడు కొణతాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పేదలకు బట్టలు, బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. న్యూకాలనీలో ఆశ్రయుద్దాం బుద్ధిమాంద్యం కలిగిన విద్యార్థులకు బ్యాగుల పంపిణీ, రోగులకు పండ్లు పంపిణీ చేపడతాని చెప్పారు. కొణతాల క్రికెట్ కప్‌లో విజేతలకు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొణతాల అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలను తీర్చేందుకే జన్మభూమి


మాట్లాడుతున్న వేణుగోపాల్

ప్రజాశక్తి - గొలుగొండ

ప్రజాసమస్యలను తీర్చేందుకే ప్రభుత్వం జన్మభూమి - మా ఊరు కార్యక్రమం చేపట్టిందని గొలుగొండ జెడ్‌పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలో కొంగసింగి, అమ్మపేట, చీడిగుమ్మల గ్రామాల్లో జన్మభూమి సభలు జరిగియి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులైనవారు జన్మభూమిలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరయిన కొత్త రేషను కార్డులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ, ఎండిఒ సువర్నరాజు, తాహశీల్దారు అంబేద్కరు, ఇఒపిఆర్‌డి త్రిమూర్తులు, పలువురు మండలస్థాయి అధికారులు, నాయకులు , ప్రజలు పాల్గొన్నారు.

7 నుంచి గుడివాడ కప్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి మండలం లోని గోపాలపురం గ్రామంలో ఈ నెల 7 నుండి 22 వరకు గుడివాడ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని వైసిపి మండల శాఖ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు చెప్పారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం వైసిపి అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జానకీరామరాజు, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంతులూరి శ్రీధర్‌రాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జిల్లా కార్యదర్శి పిడి గాంధీ, కరక సోమునాయుడు ఆవిష్కరించారు.

కొణతాల కప్ విజేతకు నేడు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి- అనకాపల్లి

పట్టణంలో ఎన్‌టిఆర్ స్టేడియంలో గత నెల 25 నుండి జరుగుతున్న కొణతాల క్రికెట్ కప్ విజేతలకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పలకా ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ పలకా రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లా నుండి మొత్తం 56 జట్లు పాల్గొన్నాయని, గురువారం ఫైనల్స్ నిర్వహిస్తారని చెప్పారు. విజేతలకు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సోదరుడు రఘునాథ్ బహుమతులు అందజేస్తారని తెలిపారు. బుధవారం మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ మెడల్స్‌ను ట్రాఫిక్ సిఐ కొమ్ము శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉగ్గిన శ్రీను, నాగార్జున అర్జు, అప్పలరాజు పాల్గొన్నారు.

సినిమా... సినిమా



అనకాపల్లిలో సినిమాలు

పట్టణంలో సినిమాలు...

రామచంద్ర	ది కంట్రీస్
రాజా	ఒక్క క్షణం
సత్యనారాయణ	హలో
శ్రీ సత్యనారాయణ స్క్రీన్ 2-	జుమాంజి
షిర్డిసాయి	నీ ప్రేమే నా ప్రాణం
పర్తిసాయి	ఎంసిఎ
వెంకటేశ్వర	ప్రాజెక్టు జెడ్


చోడవరం

సాయిలక్ష్మి -	ఎంసిఎ
శ్రీసాయిలక్ష్మి -	హలో
సాయిసిరిమేక్స్ -	దేవిశ్రీప్రసాద్
పూర్ణ	-మళ్లీరావా..

నర్సీపట్నం

శ్రీకన్య :	జవాన్
కన్య :	లచ్చి
కన్యమినీ :	రాజా ది గ్రేట్
సాయిశ్రీకన్య :	10
రాజు మూవీమేక్స్ :	సీత రాముని కోసం
బంగార్రాజు :	సప్తగిరి ఎల్ఎల్‌బి

అనకాపల్లి బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్ యార్డుకు బుధవారం 17535 బెల్లం దిమ్మలు దిగుమతి అయ్యాయి. 100 కేజీలు చొప్పున ధరలు ఇలా ఉన్నాయి. (రూ.)

	గరిష్టం	కనిష్టం
మొదటి రకం :	3575	2930
రెండవ రకం :	3150	2,730
మూడో రకం :	2,855	2200

మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం

ప్రజాశక్తి-మాడుగుల

ఆఫుమేఘాలపై వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు లబ్దిదారులపై ఒత్తిడి తీసుకు వస్తుండగా నిర్మాణాలకు అవసరమయ్యే సామగ్రి కొరతతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మార్చి నెలాఖరు నాటికి మండలంలోని వివిధ పంచాయితీలలో శత శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేయాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితాలు మాత్రం ఆ దిశగా సాగ లేదు. లబ్దిదారులకు స్థలం, లేకపోవడం, నిర్మాణాలు పూర్తి అయితే బిల్లులు మంజూరు కావనే సందేహంతో మండలంలోని వివిధ గ్రామాలలో మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. కొన్ని చోట్ల ఒకేసారి అందరూ నిర్మాణాలు సాగిస్తుండటంతో సామగ్రి కొరత ఎదురవుతుంది. గతంలో వర్షాల కారణంగా గత ఆరు నెలలుగా ఇటుకల తయారీ నిలిచి పోగా, నిర్మాణాలు పెరుగుతుండటంతో ఇపుడిప్పుడే తయారీ ప్రారంభం అయ్యింది. ఒక్కసారిగా డిమాండు పెరగడంతో వెయ్యి ఇటుకల ధర ప్రస్తుతం ఆరు వేలకు చేరింది. ఓ వైపు మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు గృహ నిర్మాణాల పథకంలో ఇళ్ల నిర్మాణాలు జోరందుకోవడంతో పూర్తి స్థాయిలో ఇటుకలు అందుబాటులో లేవు.మరుగుదొడ్ల సెప్టిక్‌ట్యాంకు నిర్మాణాలకు సిమ్మెంటు ఒరలు అవసరం కావడంతో వీటికి కొరత ఏర్పడింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం అయిన తరువాత ఒరలు తయారు చేసేవారి సంఖ్య పెరిగినప్పటికీ అనుకున్నంత మేర సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో దీని ప్రభావం నిర్మాణాలపై పడుతుంది. సిమ్మెంటు ఒరలు పూర్తిగా ఆరకుండానే నిర్మాణా లకు ఉపయోగిస్తున్నారు.


అమాంతంగా పెరిగిన ఇటుక ధరలు

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి - మాడుగుల

కార్తీక మాసం ముగిసినా కూరగాయల ధరలు దిగి రాలేదు. అన్ని రకాల కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. కార్తీక మాసంలో అనేక మంది మాంసాహారం తీసుకోకపోవడంతో సాధారణంగా కూరల ధరలు ఎక్కువగా ఉంటాయి. ఆ మాసం ముగిసినా తగ్గ లేదు.డిశంబరు నెల నాటికి కాలీఫ్లవర్ ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. అయితే ఈ ఏడాది కాలీఫ్లవర్ తక్కువగా వస్తుండటంతో వీటి ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. గతంలో ఒక్కొ పువ్వు రూ.10 ఉండేది. ప్రస్తుతం రూ.20లకు పైబడి ధర ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.40, వంగ, బెండ, ఆనప, కాకర, బీర,


మార్కెట్‌లో కూరగాయలు

బీన్స్ ధరలు కిలో రూ.40నుండి 60 వరకు ఉన్నాయి. చలికాలంలో దొరికే బస్తరపిక్కలు రెండు వారాల క్రిందట కిలో రూ.30లకే లభించినా ప్రస్తుతం కిలో రూ.80 వరకు ఉంది. మునగకాడలు రూ.20కు మూడు ఇస్తున్నారు. ఆనప కాయ రూ. 20 ఉంది. శీతాకాలంలో విరివిగా దొరికే ఉల్లికాడలు సైతం ఎక్కువ ధర పలుకుతున్నాయి. దీంతో వినియోగ దారులకు చుక్కలు కనబడుతున్నాయి. ఖరీఫ్ వరి ముగిసిన తరువాత మెట్ట ప్రాంత భూములలో ఎక్కువ మంది కూరగాయల సాగు చేపడుతుంటారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించినా ఈ ఏడాది కూరల ధరలు ఎక్కువగా ఉన్నాయి. మండలం లోని కృష్ణంపాలెం ప్రాంతంలో ఈ ఏడాది క్యాబేజీ, కాలీఫ్లవర్ పండించక పోవడంతో వీటి ధరలు ఎక్కువగా ఉన్నాయి. కూరగాయలు పండిస్తున్న రైతులకు మాత్రం మంచి ధరలు రాకపోగా, వినియోగదారులకు చుక్కలు కనబడుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

పెద్దలపై చర్యలేవీ?

సిపి యోగానంద్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. అత్యాచారానికి పాల్పడిన బస్ డ్రైవర్‌ను ఎ1 ముద్దాయిగాను, సెక్యూరిటీ అధికారి ప్రకాశరావును ఎ2 గాను, బస్ యజమాని అప్పలరాజును ఎ3 గాను చేర్చుతూ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కానీ సెటిల్మెంట్‌లో కీలక పాత్ర పోషించిన మిగిలిన అధికారులను మాత్రం వదిలేయడం చర్చనీయాంశమైంది. బాధితురాలు గిరిజన తెగకు చెందినది కావడంతో కేసును ఎస్సీ ఎస్టీ సెల్ పోలీసు అధికారి ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఆధీనంలోనే తదుపరి విచారణ జరుగుతుంది. మూగ గిరిజన యువతి జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తికి కొమ్మకాసిన వ్యక్తులందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. ఒక బలహీన తెగకు చెందిన బాలిక అత్యాచారానికి గురైతే, ఎస్ఈజెడ్ అధికారులు ఆమెకు సహాయం చేయకుండా నిందుతునితో చేతులు కలిపి శీలానికి వెల కట్టడం పట్ల మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. వెంటనే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

15ఏళ్ల బాలికతో వెట్టి చాకిరీ..

15 ఏళ్ల బాలికను ఆ కంపెనీ తోట పనికి పురమాయించిన కాంట్రాక్టర్ ఎవరు? లోనికి ప్రవేశించేందుకు అవసరమైన గుర్తింపు కార్డు కోసం ఆమె ఏయే గుర్తింపు పత్రాలు సమర్పించింది? అసలు ఆమె వయసు ఎంతనేది తెలియకుండానే అధికారులు పనిలోకి తీసుకున్నారా? ఏడేళ్లగా ఆ బాలికతో ఎలా పనిచేయించుకుంటున్న అధికారులు వారి యోగక్షేమాలు పట్టించుకోరా? కేవలం మూడు వేల రూపాయలు వేతనంతో వెట్టి చాకిరీ చేయిస్తున్నా యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు. అసలు అక్కడ పని చేసే ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు అందుతున్నాయా లేదా అనేది సందేహం కూడా మొదలవుతుంది. మూగ బాలికకు గుర్తింపు కార్డు గనుక జారీ చేసి ఉంటే ఆధార్‌కార్డు చూసి వయస్సు ధ్రువీకరించిన తరువాత కార్డు మంజూరు చేస్తారు. కనీసం అధికారులు ఆధార్ కార్డులోని వయసు తదితరాలను చూడకుండానే ఎంట్రీ పాస్ ఇచ్చేశారా అనేది కూడా ప్రశ్నగానే మిగిలింది. కాంట్రాక్టర్లు, సెక్యూరిటీ అధికారితో పాటుగా హెచ్‌బిఎల్ అధికారుల మధ్య లాలూచీ ఉండటంతోనే ఎటువంటి ఆధారాలు లేకుండానే పనిలో చేర్పించుకుంటున్నారన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఎస్ఇజెడ్‌లో ఒప్పంద కార్మికుల నియామకాలు, వారికి వేతన చెల్లింపుల విషయంలో పెద్ద కుంభకోణం నడుస్తుందేమోననే భావన కలుగుతోంది. అమాయక గిరిజనులను పనుల నిమిత్తం తీసుకొచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకుని చాలీచాలని వేతనాలు వారి చేతిలో పెట్టడమే కాకుండా ఇలాంటి అత్యాచారాలకు పాల్పడటంపై నగరమంతా అట్టుడుకుపోతోంది. బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రజా, మహిళా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

గిరిజన మూగ బాలికపై అత్యాచారం హేయం

వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇల్లు, భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రకటించాలని కోరారు. ఐద్వా నగర నాయకులు వేణు, ఎంబి.సత్యవతి, మంగవేణి మాట్లాడుతూ సెజ్‌లోని సిసి పుటేజీలను పోలీసులు తక్షణమే స్వాధీనం చేసుకుని విచారణను వేగవంతం చేయాలన్నారు. రోజురోజుకూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు క్షీణించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని, మద్యాన్ని నియంత్రించాల్సి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. సెజ్‌ల్లో ఎటువంటి కార్మిక చట్టాలూ అమలుకాకపోవడం, భద్రతా చర్యలు కానరాకపోవడం వల్లే తరుచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు, నగర అధ్యక్షులు పాల వెంకయ్య, రాజు, జీవన కుమారి, లక్ష్మి, ఆనంద్, గిరిజన సంఘం నాయకులు కోటిబాబు, ఐద్వా స్టీల్, గాజువాక జోన్ల నాయకులు పాల్గొన్నారు.

పలువురి మద్దతు

ప్రజా సంఘాల ఆందోళనకు మాజీ గిరిజన శాఖ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు సివేరి సోమ, ఐఎన్‌టియుసి స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు. బాలికకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు.

ఐదు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

300 ఎకరాలు, పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 129.99 ఎకరాలు, గాజువాక నియోజకవర్గంలోని గాజువాక మండలంలో తలరివానిపాలెం, అగనంపూడి, దువ్వాడలో 120 ఎకరాలు, అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి మండలంలో కుంచంగిలో వంద ఎకరాల విస్తీర్ణంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు భూములను సిద్ధం చేస్తోంది. తొలి దశలో భూములను సిద్ధం చేసిన తరవాత పరిశ్రమల ఏర్పాటు వేగవంతమైతే రెండో దశలో మరికొంత భూమిని సిద్ధం చేయనుంది.

మం(ం)దు(మ)త్తు

యథేచ్ఛగా బెల్టుషాపులు
సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు
చోద్యంచూస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బెల్టు షాపుల ఎత్తివేత జిఒకు ఎక్సైజ్ శాఖ తూట్లు పొడుస్తుంది. జిఒలు, సాక్షాత్తూ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతారు చేస్తూ బెల్టుషాపులకు అనధికారిక అనుమతులు ఇచ్చి ఇబ్బడి ముబ్బడిగా మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో బెల్టుషాపులను ఎత్తివేస్తాం హామీ ఇచ్చింది.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరించింది. దీనిపై ప్రతిపక్షాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు, మహిళ సంఘాలు తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేశాయి. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం ఏడాది క్రితం బెల్టుషాపులను ఎత్తివేస్తూ జిఒ జారీ చేసింది. దీనిని అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలాలు, నియోజకవర్గాలు స్థాయిలో వైన్ సిండికేట్‌లతో కుమ్మకై ఇరువురు సమన్వయంతో దోచుకుంటున్నారు.



గ్రామ మధ్యలో ఏర్పాటు చేసిన బెల్టుషాపు

జిఒ అమలుపై అలసత్వం

బెల్టుషాపులను ఎత్తివేస్తూ, నిషేధిస్తూ ప్రభుత్వ ఏడాది క్రితం జారీ చేసిన జిఒపై ఎక్సైజ్ పోలీసులు చేసిన హడావుడి, ఆర్భాటం అంతా ఇంతా కాదు. ప్రతి పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శులకు ఎక్సైజ్ పోలీసులు లెటర్స్ పంపించి పంచాయతీ పరిధిలో బెల్టుషాపులు నిర్వహించవద్దని అవగాహన కల్పించారు. ఆయా లెటర్స్‌పై సంతకాలు కూడా తీసుకున్నారు. అంత వరకు బాగానే ఉన్న వారి ఆదేశాలు, సంతకాలు కేవలం కాగితాలకు పరిమితమయ్యాయి. కంచె చేను మేసిన చందంగా అమలు చేయాల్సిన అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. జిల్లా స్థాయి టీమ్‌తో బెల్టుషాపులపై దాడులు జరుగుతున్నప్పుడు ఎక్సైజ్‌శాఖ సిఐలు, ఎస్ఐలు ముందుగానే సదరు బెల్టుషాపు, వైన్‌షాపు యజమానులకు సమాచారం అందిస్తున్నారు. దీంతో వారు ముందుగానే సర్దుకొని బెల్టుషాపులు లేనట్లుగా నటిస్తున్నారు.

గ్రామాల మధ్యలో వైన్‌షాపులు

గ్రామాల మధ్యలో వైన్‌షాపులు ఉండకూడదనే నిబంధనలు ప్రకటనలకే పరిమితం అవుతుంది. షాపులకు అనుమతులు ఇచ్చేటప్పుడు గ్రామాల మధ్యలో ఉండకూడదని నిర్ణయంతో ఊరి చివర ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల తర్వాత అనూహ్యంగా గ్రామాల మధ్యలోకి మార్చారు. తుమ్మపాల, రేబాక, కొండుపాలెం తదితర గ్రామాల్లో ఊరి చివర్ల బ్రాంది షాపులు ఏర్పాటు చేసి వాటిని యథేచ్ఛగా రోడ్లపైకి తీసుకువచ్చారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు స్పందించలేదు.

8 వైన్ షాపులు, 4 బార్లు

అనకాపల్లి పట్టణంలో 8 వైన్‌షాపులు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. మండలంలో 10 వైన్‌షాపులు ఉన్నాయి. అనకాపల్లి మండలంలో 35 పంచాయతీలు ఉన్నాయి. గ్రేటర్‌లో మూడు విలీనమయ్యాయి. దీంతో ప్రస్తుతం 32 పంచాయతీలు ఉన్నాయి. 32 పంచాయతీలకు 10 వైన్‌షాపులు ఉన్నాయి.

గ్రామ పెద్దలతో ఒప్పందాలు

వైన్‌షాపుకు సమీపంలో, దగ్గరలో ఉన్న గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ దేవాలయాల కమిటీ సభ్యులు వైన్‌షాపు ఓనర్లతో మాట్లాడి సంవత్సరానికి గుడికో, గ్రామాభివృద్ధికో ఇంత ఇస్తామని రేటు నిర్ణయించుకుని ఆయా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని బవులువాడ, ఊడేరు, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో వైన్‌షాపులు లేవు. మామిడి పాలెం మెయిన్ రోడ్డు మీద ఉన్న వైన్‌షాపు యజమాని సదరు గ్రామ పెద్దలతో మాట్లాడి సంవత్సరానికి ఒక రేటు నిర్ణయించి సదరు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో దేవస్థాన కమిటీ చైర్మన్‌లతో మాట్లాడి రేటు నిర్ణయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో సర్పంచ్‌కు సంబంధం ఉండదని అంతా దేవస్థాన కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నడుస్తుందని గ్రామస్తులు చెప్పడం విశేషం.

కల్తీ మాఫియా

ఒక పక్క వైన్‌షాపుల్లో మద్యం తాగడం వల్ల కుటుంబాలు ఛిద్రం అవుతుంటే ఆ మద్యాన్ని కల్తీ చేయడం వల్ల ఎన్నో ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. అనకాపల్లి పట్టణంలోని మద్యం కల్తీ కేసులు నమోదవుతున్నాయి. ఈ కల్తీ మాఫియాకు అధికార పార్టీ నాయకులు సహకారం అందిస్తున్నారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు మద్యం మాఫియాను నడిపిస్తుందే అధికార పార్టీ నాయకులే. దీంతో అధికారులు సైతం వారితో కుమ్మకై దోచుకుంటున్నారు.

తెలుగు భాష పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

తెలుగు భాష పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టాలని లోక్‌నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. 2018ని తెలుగు భాష పరిరక్షణ సంవత్సరంగా ప్రకటిస్తూ చంద్రబాబు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నామ ఫలకాలు, శిలాఫలకాలు తెలుగులో ఉండేలా గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేలా చర్యలు గైకొనాలని కోరారు. జన్మభూమి కార్యక్రమాలకు హాజరయ్యే ముఖ్యమంత్రి సహ ప్రజాప్రతినిధులందరూ తెలుగు భాష పరిరక్షణ కోసం ఐదు నిమిషాలు కేటాయించాలన్నారు. తెలుగు



మాధ్యమంలో బోధనలను పరిశీలించాని కోరారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మేరకు రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వ విద్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నగర ప్రముఖుల లేఖ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రొఫెసర్ సాయిబాబాను జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు లేఖ రాసినట్లు పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీ, యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబాకు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు గత ఏడాది మార్చి 7న జీవిత ఖైదు విధించిందని పేర్కొన్నారు. దేశంలోని ఆదివాసీలు, నిర్వాసితులు, పేద ప్రజలకోసం ఆయన ఉద్యమిస్తున్నారని, 90 శాతం అంగవైకల్యం కలిగిన ఆయనను జైలునుంచి విడుదల చేయాలని కోరారు. లేఖపై సంతకాలు చేసిన వారిలో ఎయు పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కెవి రమణ, ప్రొఫెసర్ సూరప్పుడు, ప్రొఫెసర్ మంజులత, పిడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, సిపిఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, ఒపిడిఆర్ కార్యదర్శి సి.భాస్కరరావు తదితరులు ఉన్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి తీర్మానం 70/175 ప్రకారం అంగవైకల్యం కలిగిన ఖైదీలు విడుదలకు అవకాశముందని, దీనిని గమనంలోకి తీసుకుని నాగపూర్ జైలులో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు.

యువజనోత్సవాలలో టిఎస్ఆర్, టిబికె ప్రతిభ

ప్రజాశక్తి-గాజువాక

ఆంధ్రాయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం యువజనోత్సవాల్లో టిఎస్ఆర్, టిబికె విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు. బృందనాట్యం విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, యూనివర్సిటీ స్థాయిలో తృతీయ స్థానం పొందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆయన అభినందిస్తూ మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు మానసిక వికాసానికి అవసరమైన ఆటపాటలు, సమాజ సేవను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.విష్ణువర్ధనరావు, వైస్ ప్రిన్సిపల్ విడిఎస్.సుభాషిణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకటనలో స్పష్టత కరువు

గాజువాక : హౌస్ కమిటీకి సంబంధించి ఎమ్మెల్యే జన్మభూమిలో చేసిన హౌస్ కమిటీ పరిష్కార ఘనత టిడిపిదే అని చేసిన ప్రకటన అవాస్తవమని గాజువాక గృహ యజమానుల సంక్షేమ సంఘం కార్యదర్శి కె.కిరీటం పేర్కొన్నారు. హౌస్ కమిటీకి సంబంధించి 8500 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 7వేల మందికి అర్హులుగా గుర్తించారని తెలిపారు. గుర్తించిన వారిలో 5,236 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అందులో 1500 పట్టాల్లో తప్పులుగా ఉన్నాయని, 2,500 పట్టాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 40 సంవత్సరాలుగా నివాసముంటున్న వారికి సర్వే చేయకుండా విడిచిపెట్టారని వివరించారు. ఇచ్చిన పట్టాల్లో కూడా సరైన హక్కులు విధించడం వల్ల ఎందుకూ ఉపయోగం లేకుండా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన ప్రకటనకు, వాస్తవానికి పొంతన లేని విధంగా ఉందని పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలలు ప్రారంభం



ఏకలవ్య పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిడారి

ప్రజాశక్తి-అరకు రూరల్ ,పెదబయలు

అరకులోయ యువజన శిక్షణా కేంద్రంలో బుధవారం ఏకలవ్య పాఠశాలను అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డుంబ్రిగుడ మండలానికి సంబంధించి ఏకలవ్య పాఠశాల వసతి సౌకర్యం లేక అరకు వైసిపిలో తాత్కాలికంగా ప్రారంభిస్తున్నామన్నారు. డుంబ్రిగుడ మండలంలో ప్రస్తుతం స్థల సేకరణలో ఉన్నామని, భవనాలు నిర్మించేందుకు సుమారు రూ.12 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో స్థల సేకరణ అనంతరం పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం....

పెదలబుడు పంచాయితీకి చెందిన 35 మంది గిరిజన మహిళలకు ఎపిఎస్ఎస్‌డి, ఐటిడిఎ సంయుక్త ఆధ్వర్యాన 60 రోజుల పాటు కుట్టు శిక్షణను ఎమ్మెల్యే కిడారి ప్రారంభించారు. శిక్షణ అనంతరం మహిళలకు కుట్టుమిషన్‌లకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఆర్థికంగా ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం....

మండలంలోని 14 పంచాయితీలోని గిరిజన యువకులకు బుధవారం వైటిసిలో డ్రైవింగ్ శిక్షణను స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ప్రారంభించారు. మొదటి విడతగా 30 మందికో ఈ శిక్షణనిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్సునిచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అరుణకుమారి, సర్పంచ్ గులాబి, వైస్ సర్పంచ్ సత్యానందం, రఘునాథ్, ప్రిన్సిపల్ నారాయణ, కో-ఆర్డినేటర్ చంటిబాబు, ఫ్యాకల్టీ శోభన్‌బాబు, జెఆర్‌పి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో...

గిరిజన సంక్షేమ గురుకులం కార్యదర్శి దేవర వాసు ఆదేశాల మేరకు స్థానిక వైటిసిలో ఏర్పాటుచేసిన ఏకలవ్య మోడల్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలను ఎంపిపి సల్లంగి ఉమామహేశ్వరరావు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అంతకుముందు సర్పంచ్ విజయ చదువుల మాత సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో ఎంపిపి మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన విద్యను అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలల మాదిరిగానే ఏకలవ్య పాఠశాలలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాల్లో పాఠశాలలను నెలకొల్పి గిరిజనులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్‌పిటిసి గంగాభవాని, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వరరావు , స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు, ఎటిడబ్ల్యుఒ శాంతకుమారి, మండల టిడిపి అధ్యక్షులు సన్యాసిదొర, గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు సూరయ్య, సిడిపిఒ బాలమణిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలతో పిఒ చర్చలు విఫలం

ప్రజాశక్తి-పాడేరు

తొలగించిన తమను విధుల్లోకి చేర్చుకోవాలంటూ స్థానిక ఐటిడిఎ ఎదుట 15 రోజులుగా ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లతో బుధవారం ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఏడాది కాలపరిమితితో నియామక ఉత్తర్వులు అందిస్తేనే దీక్షలు విరమిస్తామని ఆరోగ్య కార్యకర్తల సంఘం డివిజన్ అధ్యక్షులు శెట్టి నాగరాజు పిఒకు తెలిపారు. స్పందించిన పిఒ ఆరోగ్య కార్యకర్తలంతా విధుల్లోకి చేరాలని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందించిన వెంటనే ఏడాది కాలపరిమితితో నియామక పత్రాలు అందిస్తామని చెప్పారు. ప్రతిసారీ ఏదో ఒకటి చెప్పి తమను మోసం చేస్తున్నారని, తమకు నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తూ అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకు దీక్షలు చేపడతామని, అవసరమైన ఆమరణ నిరాహార దీక్షలు చేయడానికైనా సిద్ధమని ఆరోగ్య కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ చర్చల్లో గిరిజన సంఘం నాయకులు ఎం.ఎం.శ్రీను, బాధిత ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యాచార నిందితునిపై నిర్భయ కేసు : సిపిఎం

ప్రజాశక్తి-అరకు రూరల్

మండలంలోని లోతేరు గ్రామానికి చెందిన మూగ గిరిజన బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ విశాఖలోని దువ్వాడ ఎస్ఇజెడ్‌లో హెచ్‌బిఎల్ కంపెనీలో ఐదు నెలల నుంచి తోటమాలిగా పనిచేస్తున్న బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని పట్టుకొని అతడిపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజన సమస్యలు ప్రభుత్వానికి పట్టవా? : వైసిపి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు

గిరిజన మహిళల నీటి కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని వైసిపి అరకు సమన్వయకర్త చెట్టి ఫాల్గుణ అన్నారు. బుధవారం మాకవరం పంచాయతీ కేంద్రంలో వైసిపి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలపై ఆరోపణలు గుప్పించారు. గిరిజనులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం మాకవరం గ్రామంలో పాల్గున, వైసిపి నాయకులంతా పల్లెనిద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లిఖార్జునరావు, పాపారావు, గోపాల్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి ఎన్ఎంయు కార్మికులు

సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయు ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాడేరు ఎపిఎస్ఆర్‌టిసి డిపో గేటు వద్ద ఎన్ఎంయు కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు విశాఖ జిల్లా చైర్మన్ పిఎం.రాజు, డిపో అధ్యక్షులు టి.రమణ మాట్లాడుతూ కార్మికులకు యూనిఫాం ఇప్పించాలని, కార్మికులపై చేస్తున్న దమనకాండను విడనాడాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులు చేపట్టబోయే చర్యలకు మేనేజ్‌మెంట్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు



క్యాలెండర్లు పంచుతున్న వైసిపి నాయకులు

వైసిపి క్యాలెండర్లు పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు

రాష్ట్రానికి ప్రత్యేక హోదాకై ప్రతిఒక్కరూ ఉద్యమించాలని వైసిపి యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్ పిలుపునిచ్చారు. బుధవారం పెదబయలు మండల కేంద్రంలోని వ్యాపార దుకాణాలు, గృహాలకు వెళ్లి 2018 వైఎస్ఆర్‌సిపి 'జగనన్న వస్తున్నాడు' క్యాలెండర్‌లను పంచిపెట్టి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి అధినేత నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కూడా అనంతరావు, దడియ సతీష్, దడియ సత్యనారాయణ, బి.కరియా, జుంబు సూకరాజు, ప్రసాద్, పూర్ణయ్య, సీతారం, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

అందని చంద్రన్న కానుకలు

జిసిసి డిఎమ్‌ను నిలదీసిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అనంతగిరి

రేషన్ లబ్ధిదారులకు చంద్రన్న కానుకల పంపిణీ సక్రమంగా జరగడం లేదని సిపిఎం నాయకులు కిల్లో మొశ్య, నాగులు జిసిసి డిఎం మోహనరావును బుధవారం నిలదీశారు. స్థానిక డిఆర్ డిపోను సందర్శించిన వారు లబ్ధిదారులకు అందిస్తున్న సరకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొంపల్లి పంచాయతీ డిఆర్ డిపో పరిధిలో చంద్రన్న కానుకలు సక్రమంగా అందడం లేదన్నారు. స్పందించిన డిఎం ఆన్‌లైన్ విధానం కావడంతో చంద్రన్న కానుకలు కొంతమందికి మంజూరు కాలేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్‌టిఆర్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-పాడేరు

ఈ నెల 5వ తేదీన ఐటిడిఎ కార్యాలయంలో జరగాల్సిన ఎల్‌టిఆర్ విచారణలు పరిపాలనా కారణాలతో వాయిదా పడినట్టు ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి తెలిపారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది పిటిషనర్లకు, రెస్పాండెంట్లకు నోటీసుల ద్వారా తెలియజేస్తామని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గిరిజన హక్కుల, సంస్కృతి పరిరక్షణకు కృషి

ఐటిడిఎ పిఒ రవిసుభాష్

ప్రజాశక్తి-పాడేరు

గిరిజన సంస్కృతి, హక్కుల పరిరక్షణ, అభివృద్ధే ధ్యేయంగా ఐటిడిఎ పనిచేస్తుందని పాడేరు ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి అన్నారు. బుధవారం ఐటిడిఎ కార్యాలయంలో ఏజెన్సీ స్టడీ టూర్‌కు వచ్చిన చెన్నై ఆసియన్ స్కూల్ ఆఫ్ జర్నలిజం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ మన్యంలో పాడేరు ఏజెన్సీ స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని అన్నారు. 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు భూమిపై ఎటువంటి హక్కు ఉండవన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమం అన్ని గ్రామాల్లో జరుగుతోందని, ప్రజల సమస్యలను అధికారులు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు పిఒ విపులంగా సమాధానాలు అందించారు. సమావేశంలో జర్నలిజం విద్యార్థులతో పాటు డిజిటల్ మీడియా ప్రొఫెసర్ దేవదాస్‌రాజారామ్, టివి ప్రొఫెసర్ నిశ్రాత్ అహ్మద్, ఐటిడిఎ తరుపున పరిపాలనా అధికారి వేగి అప్పారావు, మేనేజరు వి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నయ్ జర్నలిజం విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ


కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారంలో విఫలం

హుకుంపేట : కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు విఫలమవుతున్నారని సిపిఎం నాయకులు కె.రమణమూర్తి అన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 15 రోజులుగా దీక్షలు చేపట్టినా వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆరోగ్య కార్యకర్తలు లేకుంటే గిరిజన గ్రామాల్లో వైద్యసేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారికి సిపిఎం సంపూర్ణ మద్దతును అందిస్తున్నదన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు లక్ష్మణ్, రామారావు, పుణ్యారావు పాల్గొన్నారు.

రహదారి సమస్యపై జన్మభూమిని అడ్డుకుంటాం

అనంతగిరి : మండలంలోని పైనంపాడు పంచాయతీ ఎగువసొనభ నుంచి కాకరపాడు గ్రామం వరకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరిగే జన్మభూమి కార్యక్రమాన్ని అడ్డుకుంటామని పైనంపాడు సర్పంచ్ బొజ్జన్న, ఆ గ్రామస్తులు తెలిపారు. సమస్యలను పరిష్కారంపై గ్రామస్తులంతా సమిష్టిగా ఆందోళన చేపట్టనున్నారన్నారు. సమావేశంలో గ్రామస్తులు మోహనరావు, బాబూరావు, కిల్లో రామ్మూర్తి, గురుమూర్తి, మోహనరావు, రాజారావు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి సత్కారం



లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

ఉపాధ్యాయురాలిగా కిల్లోగుడ ఎలిమెంటరీ పాఠశాల టీచర్ ఆర్.లక్ష్మి గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఉత్తమ సేవలు అందించాలని ఎంఇఒ త్రినాథ్‌రావు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కిల్లోగుడ పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి దంపతులను యుటిఎఫ్, పిఆర్‌టియు, డిటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో విద్యాబోధనలోనే కాకుండా క్రమశిక్షణతో పాటు సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బాలాజీ, కిల్లోగుడ పాఠశాల హెచ్ఎం పి.ప్రసాద్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు కన్నయ్య, జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ సత్యనారాయణ, పిఆర్‌టియు మండల అధ్యక్షులు అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి రాందాసు, ఉపాధ్యాక్షులు ఎం.శ్రీను, జిల్లా కౌన్సిలర్ మధు, గిరిజన ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంజీవరావు, ఉపాధ్యక్షులు టి.సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం
గురువారం 4
జనవరి 2018



వేరుశనగలో సస్యరక్షణ చర్యలు

జిల్లాలో దేవరాపల్లి, మాడుగుల, కె.కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో వేరుశనగను రైతులు సాగు చేస్తున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రెండో పంటగా సాగు చేస్తే అధికంగా దిగుబడి వస్తుంది. ఈ పంట కాలం 100నుంచి 110రోజులు. జిల్లాలో సుమారు 3,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. రైతులు తగిన యాజమాన్యం పద్ధతులు పాటించక పోవటంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డి. ఉమామహేశ్వరరావు అందిస్తున్న సూచనలు.



ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

విత్తన మోతాదు, శుద్ధి:

సాధారణంగా రైతులు తక్కువ విత్తన మోతాదు వాడతారు. దీంతో ఆశించిన దిగుబడులు రావు. ఖరీఫ్ సీజనులో ఎకరాకు 50 కిలోల గింజలను విత్తనంగా వాడాలి. కిలో విత్తనానికి ముందుగా 2మి.లీ ఇమిడా క్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చేయాలి. దీంతో వేరుపురుగు, కాండం కుళ్లు వైరస్‌ను వ్యాపించే పురుగులను నివారించవచ్చును. తరువాత కిలో విత్తనానికి 4 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి మందును పట్టించాలి. దీంతో మొదలు, వేరు, కాండము కుళ్లు తెగుళ్లను నివారించ వచ్చును. మొదటి సారిగా వేరుశెనగ వేసే పొలాల్లో విత్తనానికి రైజోబియం కల్చర్‌ను పట్టించవచ్చును.

విత్తన పద్ధతి:

జిల్లాలో రైతులు సాధారణంగా బొంగరం చాళ్లలో విత్తుతున్నారు. అలా కాకుండా వరసల చాళ్లలో వరసకు వరసకు అడుగు దూరంలో మొక్కకు మొక్కకు గుత్తి రకాలకు 10 సెం.మీ. మరియు తీగ రకాలకు 15 సెం.మీ ఎడములో విత్తుకోవాలి. జిల్లాలో వివిధ అనుకూలమైన కె-6, అభయ, గ్రీష్మ, అనంత, హరితాంధ్ర వంటి రకాలను విత్తుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం:

రైతులు సరియైన ఎరువుల యాజమాన్యం పాటించకపోవటంతో ఆశించిన దిగుబడి పొందలేక పోతున్నారు. వేరుశెనగ రైతులు ఎకరాకు 4-5 టన్నుల సేంద్రియ ఎరువుతో పాటు 16 కిలోల భాస్వరం (సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో 100 కిలోలు) 20 కిలోల పొటాష్ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) రూపంలో వేయాలి. 18 కిలోల యూరియా విత్తే సమయంలో వేయాలి. 9 కిలోల యూరియాను నాటిన 30 రోజులకు వేయాలి. వీటితో పాటు గంధకం మరియు సున్నం అధిక మోతాదులో కలిగిన 200 కిలోల జిప్సం నాటిన 45 రోజులలు అనగా రెండవ గొప్పు సమయంలో మొక్క మొదళ్లలో వేసి తడి పెట్టాలి.
జింకు లోపం ఉన్న పొలాల్లో ఎకరాకు 10 కిలోల జింక్ సల్ఫేట్ మూడు పంటలకు ఓ సారి వేస్తే పంట ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన, నిండైన గింజలు ఏర్పడి అధిక నూనె శాతం పొందవచ్చును.

నీటి యాజమాన్యం:

తేలిక పొడి నేలలో 8నుంచి 9 తడులు 10 రోజుల వ్యవధిలో ఇవ్వాలి. వేరుశెనగకు 400 నుంచి 450 మి.మీ నీరు అవసర మవుతుంది. విత్తే ముందు నేల బాగా తడిచేలా చేసి చెమ్మ ఉన్నప్పుడు విత్తనం వేయాలి. ఊడలు దిగే సమయం (45-50 రోజుల) నుండి గింజలు ఊరేదశ (85-90 రోజుల) వరకు సున్నితమైన దశలు. ఈ దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. స్పింక్లర్లు లేదా డ్రిప్ పద్దటి ద్వారా నీటి తడులు ఇస్తే నీటిని ఆదా చేయవచ్చును.



పంటను ఆశించే పురుగులు - సంరక్షణ

వేరు పురుగు:

ఈ వేరు పురుగు తేలిక పాటి నేలలో ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగు ఆశించిన మొక్కలు ఎండిపోయి చని పోతాయి. మొక్కలు పీకితే సులువుగా ఊడి వస్తాయి. ఈ పురుగు నివారణకు 10శాతం ఫోరేట్ గుళికలు ఎకరానికి 6 కిలోల గింజ నాటేటప్పుడు వేయాలి. ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ లేదా క్లోరిఫైరిఫాస్ 6 మి.లీ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. లోతు దుక్కులు చేయడంతో వేరు పురుగు కోశస్థ దశలో బయట పడి ఎండవేడిమి మరియు పక్షులతో మరణిస్తాయి.

రసం పీల్చే పురుగులు:

తామర పురుగులు, పేను బంక, ఆకు పచ్చదోమ మరియు అక్షింతల పురుగులు పంట నాటిన 10 రోజుల నుండి వివిధ దశలో ఆశిస్తాయి. తామర పురుగుల ద్వారా మొవ్వు, కాండము కుళ్లు, వైరస్ తెగుళ్ళను సంక్రమింపజేస్తాయి.

నివారణ:

తామర పురుగుల నివారణకు ఎకరానికి 320 మి.లీ మోనోక్రిటోఫాస్, 1 లీ. వేపనూనె, కిలో సబ్బుపొడిని 200 లీటర్ల నీళ్లలో కలిపి 10 నుండి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

పేనుబంక, పచ్చ దోమలు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చి నప్పుడు ఆకులు పసుపు వరలో మారతాయి. తేనె బంకతో తేనె వంటి జిగురు పదార్థం మొక్కలపై స్రవించడంతో మొక్కలపై నల్లని బూజు ఏర్పడుతుంది.



పంటను ఆశించిన వేరు పురుగు

పొగాకు లద్దె పురుగు:

వేరుశనగను ఆశించే ప్రధానమైన పురుగు. తల్లి రెక్కల పురుగులు ఆకుల అడుగు బాగా గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు ఆకును గోకి తినివేసి ఆకులను జల్లెడలా చేస్తాయి. బాగా ఎదిగిన పురుగులు ఆకులను తినివేస్తాయి.

నివారణ:

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి ఈ పురుగులను నివారించవచ్చు. వేసవి దుక్కులు చేసి నేలలోని లార్వాలను నాశనం చేయాలి. ఎక్కువ నీటితడులు పెట్టరాదు. ఎకరా వేరుశనగకు 30-40 ఆముదం, ప్రొద్దు తిరుగుడు మొక్కలను ఎర పంటలుగా వేయాలి. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి మగరెక్కల పురుగులు చిన్నవిగా ఉన్నపుడు పిచికారీ చేయాలి. క్వినాపాల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 10 పక్షి స్థావాలు ఏర్పాటు చేయాలి. వరి తవుడు 5 కిలోలు కిలో బెల్లం, క్లోరిపైరిఫాస్ 500 మిలీలీటర్లు కలిపి విషపు ఎరలు చేసి ఎకరా పొలలో అక్కడక్కడ ఉంచి ఈ పురుగులను నాశనం చేయవచ్చును.



కలుపు నివారణ:

ఉత్తరాంధ్ర జిల్లాలో అధిక తేమతో కలుపు సమస్య ఎక్కువగా ఉండును. కలుపు నివారణకు విత్తిన వెంటనే 2-3 రోజులలో అల్లాక్లోర్ 50శాతం ఎకరానికి లీటరు లేదా పెండి మిథాలిన్ 30శాతం ఎకరానికి 1.3 -1.6 లీటర్లలో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తిన 20-25 రోజులకు మరియు 40-45 రోజులకు రెండు సార్లు కలుపు తీసుకోవాలి. 45 రోజుల తర్వాత ఏ విధమైన అంతరక షి చేయరాదు.

అంతర పంటలు

రైతునేస్తం

వేరుశెనగను ఏక పంట గానే కాకుండా అంతర పంటలుగా కూడా వేసుకోవచ్చు. దీంతో వివిధ పంటల నుండి అధిక దిగుబడులు పొందవచ్చును. వేరుశెనగ అంతర పంటగా కంది, ఆముదము, సజ్జ మరియు జొన్న సాగు చేసుకోవచ్చు. అంతర పంటల విధానముతో మంచి పోషకయాజమాన్యం జరుగుతూ పంటల మధ్య పోటీ లేకుండా నేలలో వివిధ పొరల నుంచి వివిధ పంటల వేరు వ్యవస్థ ద్వారా పోషకాలు సేకరిస్తాయి. అంతే కాకుండా వివిధ పంట సాగు చేయడంతో వివిధ కీటకాలు మరియు తెగుళ్ల వ్యాప్తిని నివారించవచ్చును.

వర్షాధారంలో ప్రతి 7 సార్ల వేరుశెనగకు 1 సాల కంది లేదా ఓ సాల ఆముదం వేసు కొనవచ్చును. ప్రతి ఆరుసాళ్ల వేరుశెనగకు రెండు సాళ్ల సజ్జ లేక జొన్న అంతర పంటగా వేసుకోవడంతో తామర పురుగుల ఉధతిని తగ్గించి వైరస్ తెగులును కొంతవరకు తగ్గించ వచ్చును. నులిపురుగుల బెడదను తగ్గించవచ్చును. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి తక్కువ ఖర్చులో చీడ పీడలను నివారించ వచ్చును.



తెగుళ్లు నివారణ పద్ధతులు

ఆకు మచ్చ తెగులు:

వేరుశెనగ నాటిన 30 రోజులలో ఈ తెగులు కనిపిస్తుంది. ఆకులపై గుండ్రని మచ్చలు కలిగి ఆకుల పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు చిన్నవిగా, గుండ్రంగా ఉండి ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి.

నివారణ:

ఈ తెగులును తట్టుకొనే వేమన, అభయ, 500-9 రకాలను విత్తు కోవాలి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రా. మెంకోజెబ్ లేదా 400 మి.లీ హెక్సాకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మొవ్వుకుళ్ళు తెగులు:

ఈ తెగులు ఆశించిన విత్తనం మొలక రాలి వాలి పోతుంది. తర్వాత దశలో కాండంపై నల్లని శిలీంద్రం కనిపిస్తుంది. తెగులు మచ్చలు మొదట మట్టమైన కాండముపై ఏర్పడి తర్వాత క్రమంగా పై కొమ్మలపై వ్యాపిస్తాయి. తర్వాత దశలలో మొక్క వడలి ఎండిపోతాయి.

నివారణ:

నివారణకు కిలో విత్తనానికి 3 గ్రా మాంకోజెబ్ కలిపి విత్తిన శుద్ధి చేయాలి. పంట మార్పిడి చేయాలి. తెగులు సోకిన వెంటనే ఎకరాకు 400 గ్రా. మాంకోజెబ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వేరుకుళ్ల తెగులు:

ఈ తెగులు రైజోక్టోనియా బెటాటికోలా' శిలీంద్రంతో వ్యాప్తి చెందును. పంట నాటిన 30 రోజుల వర్షాభావ పరిస్థితులలో ఈ తెగులు ఆశిస్తుంది. మొదట కాండంపై గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడతాయి. కొన్ని రోజుల తర్వాత నలుపు రంగుకు మారి కాండము మరియు వేరుకు వ్యాప్తిస్తాయి.



ఈ తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి 2 కిలోలు, 90 కిలోల పశువుల గెత్తం మరియు 10 కిలోల వేప పిండి కలిపి 14 రోజుల తర్వాత విత్తేముందు పొలంలో వేయాలి. పొలంలో తెగులు ఆశించిన మొక్కలను పీకి కాల్చి వేయాలి. తెగులు సోకిన మొక్కల చుట్టూ ఉన్న నేలలో 0.1శాతం కార్బండజెమ్ లేదా 0.3శాతం మాంకోజెబ్ మందుతో తడిచేటట్లు పిచికారి చేయాలి.

మొవ్వుకుళ్ల వైరస్ తెగులు:

ఇది పేనట్ బడ్ నెక్రోసిస్ వైరస్ వస్తుంది. ఈ తెగులు లేత ఆకులపై నిర్జీవ వలయాలు లేక చారలుగా కనిపిస్తాయి. మొవ్వు ఎండిపోతుంది. లేత దశలో తెగులు ఆశిస్తే మొక్కలు కురచబడి, ఎక్కువ రెమ్మలు వస్తాయి. ఆకులు చిన్నవిగా మారి లేత ఆకుపచ్చని మచ్చలు కలిగి పాలి పోయి ఉంటాయి. లేత దశలో ఆశించిన మొక్కలలో కాయలు ఏర్పడవు. తెగులు సోకిన మొక్కల నుండి వచ్చిన వేరుశెనగ కాయ మరియు విత్తనాలు చిన్నవిగా ఉండి ముడుచుకొని ఉంటాయి.

నివారణ:

ఈ తెగులు నివారణకు వేమన, ఐ.సి.జి.యస్ 11, ఐ.సి.జి.యస్ 4 వంటి రకాలను సాగు చేయాలి. కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందులో విత్తన శుద్ధి చేసిన తర్వాత విత్తుకోవాలి. వేరుశేనగలో అంతర పంటగా సజ్జలు 7:1 నిష్పత్తిలో వేయాలి. విత్తిన 20 రోజుల తర్వాత తామర పురుగుల వ్యాప్తిని అరికట్టడానికి 80 మి.లీ ఇమిడాక్లొప్రిడ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

కారు చీకట్లో..కాంతి రేఖ

అంధ బాలికల్లో ఆత్మ విశ్వాసం నింపుతున్న పాఠశాల
నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

ఒక్క క్షణం కళ్లు మూసుకోండి.. అంతా శూన్యం.. చిమ్మ చీకటి, గాడాంధకారం. అడుగు ముందుకు పడదు. చేతులు పనిచేయవు. కేవలం ఒక్క క్షణానికే ఇన్ని అవస్థలు పడితే జీవితమంతా అంధకారంలో జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో.. ఆలోచిస్తేనే ఆందోళన, కలవరం పుడుతోంది కదా.. అంధత్వంతో పుట్టామనే వేదన చిన్నారుల జీవితాన్ని దుర్భరంగా మారుస్తుంది. ఇటువంటి బాలికలను ఆదరించి, అక్కున చేర్చుకుని, ఆత్మ విశ్వాసం పెంచుతోంది నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో సాగర్‌నగర్ ప్రాంతంలో జాతీయ రహదారిని ఆనుకుని "డగ్లస్ స్మారక అంధుల పాఠశాల"..



పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న మంత్రి గంటా (ఫైల్)



మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారులకు శిక్షణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

తమకున్న వైకల్యాన్ని అక్కడి చిన్నారులు అవరోధంగా భావించరు.. ప్రపంచాన్ని చూడలేమని కుమిలిపోరు. చూపు లేకపోయినా ఎన్నో విజయాలు సాధిస్తూ ఎందరికో ఆ బాలికలు ప్రేరణగా నిలుస్తారు. ఆటపాటల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంలోనూ అలవోకగా విజయాలు సాధిస్తున్న తీరు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వారే డగ్లస్ స్మారక అంధుల పాఠశాల విద్యార్థులు. నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

ఇక్కడుండే 70 మంది విద్యార్థులకు నిర్వాహకులు భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. 15 ఏళ్ల లోపు వారిని ఇక్కడ చేర్చుకుని 5వ తరగతి వరకు చదువు నేర్పి ఆపై చదువుకు హైదరాబాద్ సమీపంలోని నర్సాపురం పంపిస్తారు. అక్కడ 10వ తరగతి వరకు బ్రెయిలీ లిపిలో విద్య నేర్పుతారు. తర్వాత అందరిలాగే పుస్తకాలు చదివించుకుని అర్థం చేసుకుంటూ ఉన్నత విద్య కొనసాగిస్తారు. టీవీ, కంప్యూటర్ సాయంతో కూడా అధ్యయనం కొనసాగిస్తూ, సహాయకుని సహకారంతో పరీక్షలు రాస్తారు. లెక్కలు మాత్రం "ట్రైలర్స్ ఫ్రేమ్" తో చేస్తారు. నడకకు వీరు మొబైల్ స్టిక్ వాడతారు. డగ్లస్ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాక, సాంస్కృతిక, క్రీడా రంగాలలో కూడా ముందున్నారనడానికి పలు వికలాంగుల పోటీల్లో పాల్గొని బహుమతులు పొందుతుండటమే తార్కాణం.



గీతాన్ని ఆలపిస్తున్న అంధ బాలికలు

కేవలం అంధ బాలికల కోసం ప్రత్యేకంగా ఈ పాఠశాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదొక్కటే అంధ బాలికల కోసం నడుస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల. 1987లో మొదటిసారిగా 1 నుంచి 6వ తరగతి వరకు పాఠశాల ప్రారంభించారు. 1992లో 10వ తరగతి వరకు స్థాయిని పెంచారు. నాటి నుంచి నేటి వరకు 66 మందికి పైగా బాలికలు 10వ తరగతి ఉత్తీర్ణతను ఈ పాఠశాల విద్యార్థులు సాధించారు. ఈ పాఠశాలలో అంధ బాలికలు ఎవరైనా చేరాలనుకుంటే చేరాల్సిన వారికి ప్రభుత్వ వైద్యాధికారిచే 40 శాతం పైబడి అంధత్వం ఉన్నట్లు జారీ చేసిన ధ్రువపత్రాన్ని సమర్పించాలని ప్రిన్సిపల్ ఎం మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుం 70 మంది అంధ బాలికలు ఇక్కడ చదువుతున్నారన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ 9000013636 నెంబర్‌తో సంప్రదించవచ్చన్నారు.

వెలుగు కిరణాలు

నగరంలోని బాలికల అంధ పాఠశాలలో చదువుకుని గ్రూపు - 1లో ఎంపికైన ఎ రాణి డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. పి హైమావతి ఆలయ కార్యనిర్వహణాధికారిగా, కె మల్లేశ్వరి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ వారి ప్రతిభను చాటుకున్నారు. నగరానికి చెందిన కె లక్ష్మీ నార్శ్మీణమ్మ బ్రెయిలీలో రచనకు ఉపక్రమించి విజయం సాధించింది. బివికె కాలేజీలో చదివి ప్రస్తుతం మహారాణి పేటలోని రాణి చంద్రమతిదేవి (ఆర్‌సిడి) హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. వీరంతా ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఎందరో అంధబాలికలకు మార్గదర్శకంగా నిలిచారు.



వసతులను పరిశీలిస్తున్న మంత్రి గంటా (ఫైల్)

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

జనవరి 4.. ఇది అక్షరాస్యులైన అంధులు ఆజన్మాంతం రుణపడాల్సిన ఒక "లిపి బ్రహ్మ" జన్మించిన రోజు. చూపు లేని వారు చదవగలిగేలా అక్షరాలు రూపొందించి, అంధ జగత్తులో అక్షర జ్యోతులు వెలిగించిన ఆ మహనీయుడు "లూయిస్ బ్రెయిలీ" అతని పేరిట ప్రఖ్యాత మైనదే "బ్రెయిలీ లిపి". పారిస్ నగరా నికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న "కూప్‌రే" గ్రామం బ్రెయిలీ జన్మస్థలం. 1809లో పుట్టిన అతను జన్మత: అంధుడు కాదు. అతని తండ్రి చర్మకారుడు. గుర్రపు జీను తయారు చేయడానికి సిద్ధంగా అతను ఉంచిన పనిముట్టుతో నాలుగేళ్ల వయస్సున్న బ్రెయిలీ ఆడుకుంటూ ఉండగా పనిముట్టుకు ఉన్న మేకు కంటికి గుచ్చుకుని కంటిని కోల్పోయాడు. అటు తర్వాత వైద్యం సరిగా అందకపోవడంతో మొదటి కంటి ప్రభావంతో రెండో కన్ను కూడా దెబ్బతిని ఆరేళ్ల వయస్సులోనే ఆయన పూర్తి అంధుడయ్యాడు. అయినప్పటికీ బ్రెయిలీ తల్లిదండ్రులు అధైర్యపడక అతనిని ప్యారిస్‌లోని "వాలంటాన్ హునే" అంధుల పాఠశాలలో చేర్పించారు. అంధుల పాఠశాలలో చేరడానికి ముందు ఇంటి వద్ద తన తండ్రి తయారు చేసిన శిలాక్షరాలను చేతితో తాకి ఇంటి వద్దనే విద్య నేర్చుకోవడం ఆరంభించారు. అంధుల పాఠశాలలో విద్యను ఎంతో పట్టుదలగా నేర్చుకుని ఉత్తీర్ణుడై అదే పాఠశాలలో అధ్యాపకునిగా చేరాడు.



లిపి తయారీకి కృషి

ఉపాధ్యాయునిగా ఉన్న సమయంలో అంధుల కోసం ప్రత్యేకంగా ఒక లిపి తయారు చేయాలన్న కాంక్ష తీవ్రమైంది. అయితే అప్పటికే వాలంటీన్ హావే, చార్లెస్ బార్బియర్ అనే వ్యక్తులు చూపులేని వారి కోసం రెండు రకాల రాత పద్ధతులు కనిపెట్టారు. అంతకన్నా సులభ శైలిలో, బార్బియర్ రాత విధానం ఆధారంగా ఒక ప్రత్యేక లిపిని బ్రెయిలీ కనిపెట్టాలనుకున్నాడు. రెండు వరసలలో మొత్తం 6 చుక్కలు ఉండేలా తొలుత ఫ్రెంచి భాషలో తయారైన లిపిలో ముందు 10, తర్వాత మరో 30 అక్షరాలు చేరి "బ్రెయిలీ లిపి"గా రూపొందింది. తర్వాత ఆంగ్లం, ఇతర ప్రపంచ భాషలలోకి ఈ పద్ధతి ప్రవేశపెట్టడంతో దృష్టి కోల్పోయిన వారికిదో అద్భుత సృష్టిగా నిలిచింది. ప్రత్యేకమైన పలకపై దళసరి కాగితం ఉంచి "గైడ్" పరికరంపై 'స్టైయిలస్' సూదితో రంధ్రం చేస్తూ రాయడం.. ఈ లిపిలో అనుసరించాల్సిన రాత పద్ధతి. కుడి నుంచి ఎడమకు రాసిన కాగితాన్ని వెనక్కు తిప్పి ఉంచిన అక్షరాకృతులను వేళ్లతో తడిమి చదువుతారు. దీన్ని తెలుగులో కూడా ప్రవేశపెట్టారు. ఎందరో అంధులకు అక్షర సౌందర్యాన్ని సాక్షాత్కరింపజేసిన బ్రెయిలీ 1852లో క్షయ వ్యాధితో మరణించాడు. 1952లో ఆయన అవశేషాలను తవ్వితీసిన ఫ్రెంచి ప్రభుత్వం రాజ మర్యాదలతో పునస్సమాధి చేసి బ్రెయిలీపట్ల భక్తి గౌరవాలను చాటుకుంది. అంధత్వం శాపం కాదని, ఆత్మ స్థయిర్యముంటే అంతా జ్యోతిర్మయమేనని భావించి, భాసించిన వారిలో మూగ, చెవిటి అయిన అంధురాలు, ప్రముఖ కవయిత్రి హెలెన్ కెల్లర్, రచిత సూరదాస్, విశ్వవిఖ్యాత రచయిత జార్జ్ బెర్నార్డ్‌షా వంటి వారెందరో ఉన్నారు. వీరందరూ అంగవైకల్యులే అయినప్పటికే ఎందరికో స్ఫూర్తిప్రదాతలుగా నిలిచారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జన్మభూమి'

జెడ్‌పి సిఇఒ జయప్రకాష్ నారాయణ

ప్రజాశక్తి- కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా జన్మభూమి ఉపయోగపడుతోందని జెడ్పీ సిఇఒ ఆర్.జయప్రకాష్ నారాయణ అన్నారు. బుధవారం రావికమతం మండలం జడ్.కొత్తపట్నంలో జన్మభూమి సభలో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగి, అర్హులైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. జిల్లాలో 925 గ్రామ పంచాయితీల్లో ప్రజల ముంగిట సుస్థిర సేవలు అందించే దిశగా చొరవ చూపుతున్నామన్నారు.జన్మభూమి కమిటీలతో పాటు కొత్తగా సాధికార మిత్రలను ఎంపిక చేశామని, వారి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించగా, వాటిని పరిశీలించారు. గంపవానిపాలెం, దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు పేలవంగా సాగాయి. కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఎస్.సిద్దయ్య, ఎంపిడిఒ కె.జయప్రకాష్‌రావు, ఉప తహశీల్దార్ భాస్కరరావు, ఇఒఆర్‌డి మహేష్, గ్రామ సర్పంచ్‌లు గాలి మహేశ్వరీ, మాకిరెడ్డి రాజు, గట్రెడ్డి తాతబాబు, ఆదాడ తాతబాబు, ఎంపిటిసి లాలం సత్యవతి, మాకిరెడ్డి భవాని, నేతల దుర్గాలమ్మ, ఉపసర్పంచ్ వై.ఆచారి, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం: సిఇఒ

కొత్తకోట : గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని జెడ్పీ సిఇఒ ఆర్. జయప్రకాశ్‌నారాయణ అన్నారు. బుధవారం జన్మభూమిలో భాగంగా జెడ్.కొత్తపట్నంలో కొత్తకోట పిహెచ్‌సి, ఆయుర్వేద వైద్యశాల, పశువైద్యశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాలను పరిశీలించారు. ప్రజారోగ్యం మెరుగుకు వైద్యాధికారులు చొరవ చూపాలన్నారు. చిన్నపాటి వ్యాధి అయినా, దాన్ని నయమయ్యే వరకు రోగులకు ఫాలప్ చేయాలని, అవసరమైతే వారి ఫోన్‌నెంబర్లు తీసుకుని సేవలందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలపై పంచాయతీ దృష్టి పెట్టాలన్నారు. వైద్యాధికారులు ఎం.నరేంద్రకుమార్, సాంబశివరావు, ఎన్‌పి సృజన, సిబ్బంది మల్లిబాబు, బి.సత్యనారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న జెడ్పీ సిఇఒ



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సమస్యలపై విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - చోడవరం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక సభ్యులు, కార్మికులు స్థానిక ఎడిఇ ఆఫీస్ ముందు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.చంద్రరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. దళారి వ్యవస్థను రద్దు చేసి నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలని, పీస్ రేటును రద్దుచేసి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు.

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మహేంద్రగిరి

మాడుగుల : వివిధ కేన్సర్ వ్యాధులపై రోగులకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన అవసరమని విశాఖపట్నం మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్యనిపుణుడు డాక్టర్ మహేంద్రగిరి అన్నారు. బుధవారం మాడుగులలో మాట్లాడుతూ మహిళలకు ప్రధానంగా రొమ్ము కేన్సర్, గర్భాశయం ముఖద్వార కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్‌తో పాటు శరీరంలో అనేక భాగాలకు కేన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా 40 ఏళ్లకు పైబడిన మహిళల రొమ్ముల్లో గడ్డలు ఏర్పడినపుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని, ప్రాథమికస్థాయిలో కేన్సర్‌గా నిర్ధారణ జరిగితే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. హార్మోన్ల అసమానతల కారణంగా రొమ్ము కేన్సర్ సోకుతుందన్నారు. వివాహాలు ఆలస్యంగా జరగడం, పిల్లలకు తల్లిపాలు పట్టకపోవడం తదితర కారణాలతో మహిళల్లో రొమ్ము కేన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. 9 నుండి 20 ఏళ్ల వయస్సు ఉన్నవారికి సైతం గర్భాశయ ముఖద్వార కేన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. పొగాకు నమలడం ద్వారా వచ్చే నోటి కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, ప్రస్తుతమున్న కేన్సర్ కేసుల్లో 30 నుండి 40 శాతం వరకు నోటి కేన్సర్ కేసులే ఉన్నాయన్నారు. ఇటీవలి కాలంలో మన రాష్ట్రంలో నోటి కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. మహాత్మాగాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు మురళీకృష్ణ శ్రేయ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కేన్సర్ వ్యాధుల చికిత్స, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు.

రోగులకు ఉచిత కేన్సర్ పరీక్షలు

స్థానిక నేతలు వేమవరపు వెంకటరమణ, పెదబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని పలువురికి రూ. 10 వేలు విలువైన అత్యాధునిక వైద్య పరీక్షలను ఉచితంగానే నిర్వహించారు. వైద్యులు మహేంద్రగిరి, వి.శుభశ్రీ, క్యాంప్ కోఆర్డినేటర్ దినేష్, స్థానిక నేతలు దంగేటి సూర్యారావు, దండి సన్యాసయ్యదొర, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బోనస్ అందిస్తున్న అధ్యక్షులు గోవింద

పాడిరైతులకు సంక్రాంతి బోనస్

దేవరాపల్లి : పాడిరైతులందరికీ విశాఖ డెయిరీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, రైతులను ఆదుకుంటుందని డెయిరీ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ గొర్లె గోవింద అన్నారు. బుధవారం ఎం.అలమండ పాలసొసైటీలో 236 మంది రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.4,36,833లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ నుంచి రాయితీపై పాడిగేదెలు అందజేస్తున్నామని, వడ్డీ లేని రుణాలు, పాడిరైతులకు, పశువులకు ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. పాడిరైతులు డెయిరీకి నాణ్యమైన పాలను సరఫరా చేసి, సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. సూపర్‌వైజర్ టి.గోవిందరావు, కార్యదర్శి చీపురుపల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



బహుమతి స్వీకరిస్తున్న రచయిత్రి రాయవరపు సరస్వతి

జాతీయస్థాయి కథల పోటీల్లో చోడవరం రచయిత్రి సరస్వతికి బహుమతి

ప్రజాశక్తి - చోడవరం

పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత్రి రాయవరపు సరస్వతికి జాతీయస్థాయిలో నిర్వహించిన ముట్నూరి కమలమ్మ స్మారక చిన్నకథల పోటీల్లో(2017) విజేతగా నిలిచినందుకు బహుమతి లభించింది. డిసెంబరు 26న జివిఆర్ సాహితీ కిరణం, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ చిన్న కథల పోటీల్లో ఐదుగురు విజేతలకు హైదరాబాద్ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లిలో ఈ బహుమతిని అందించారు. జయజయశంకర్ టివి ఛానల్ సిఇఒ డాక్టర్ వోలేటి పార్వతీశం చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.1000 నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందించినట్లు సరస్వతి బుధవారం విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



దేవరాపల్లిలో...

దేవరాపల్లిలో..

సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని మండలంలో బేతపూడి కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, బాలికలు నివాళులు అర్పించారు. విద్యార్థినులు బ్లాక్‌బోర్డుపై గీసిన సావిత్రిబాయి చిత్రం పలువురిని ఆకట్టుకుంది. స్థానిక హైస్కూల్, కళాశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. ఆడవారి చదువు అవనికే వెలుగు అంటూ ప్రజలకు నినాదాల ద్వారా అవగాహన కల్పించారు.

చోడవరం : సావిత్రిబాయి పూలే 187వ జయంతిని ఫోరం ఫర్ ది బెటర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమసమాజంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ రామ్‌నరేష్ బిర్లంగి, ఆర్క్ డైరెక్టర్ డిఎస్ ప్రసాద్, బి.వెంకటరావు తదితరులు సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్త్రీ జనోద్ధరణ కోసం సావిత్రిబాయి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రకాశరావు, నారాయణమూర్తి, అల్లు తాతంనాయుడుపాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు వ్యాసరచన పోటీలు

కె.కోటపాడు : సావిత్రిబాయి పూలే 197వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3 నుంచి 6 వరకు మహిళా ఉపాధ్యాయులకు అన్ని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దొగ్గ శ్రీను, కె.రాజేంద్రకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నవసమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు 6న మధ్యాహ్నం 3 గంటలకు ఎ.కోడూరు జెడ్‌పి హైస్కూల్‌లో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

అరకు రూరల్ : మండలంలోని కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోయుటిఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం బి.మంగమ్మ, యుటిఎఫ్ జిల్లా నాయకులు పి.చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో తొలి ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రిబాయి అని కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వివి.ఈశ్వరరావు, పి.బాలన్న, ఎస్.నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : సావిత్రిబాయిపూలే జయంతిని స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల-1లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయురాలు సన్యాసమ్మ, ముత్యాలమ్మలను యుటిఎఫ్ నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు యుటిఎఫ్ నాయకులు రమణ, రాంబాబు, మల్లేశ్వరరావు, రఘునాథ్, పాఠశాల-1 హెచ్ఎం లక్ష్మేశ్వరి, సిపిఎస్ మండల నాయకులు టి.బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో...

డుంబ్రిగుడ : స్థానిక యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.కన్నయ్య అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక కెజిబివి, ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ సత్యనారాయణ, మండల నాయకులు చందరరావు, ఉపాధ్యాయులు ధర్మ, నాగేశ్వరరావు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : కిలగాడ కెజిబివి పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతినిపాఠశాల స్పెషల్ ఆఫీసర్ బి.సత్యవతి అధ్యక్షతన యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.నీలకంఠం, సర్పంచ్ సిహెచ్.రాజేశ్వరి, యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కె.బంగారయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మారావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎన్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.వసంతరావు, కె.పరశురాం, ఎల్.శ్రీదేవి, కె.రత్నకుమారి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - దేవరాపల్లి

అన్ని కులాలకు న్యాయం చేకూరేలా పింఛన్లు మంజూరు చేస్తూ పేదలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉందని సర్పంచ్ కిలపర్తి చిన్నమ్మలు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామంలో వీవర్స్ కోటాలో మంజూరైన పింఛన్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన శెట్టిబలిజ లబ్దిదారులకు త్వరలో పింఛన్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సోమిరెడ్డి సత్యవతి, పంచాయతీ ఇఒ ఎన్ ఎరకయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిలదీతల నడుమ జన్మభూమి

- పరిష్కారం చూపని సభలెందుకని ప్రశ్నించిన గ్రామస్తులు
- ఫొటోల పోజు కోసం గొడవ చేయవద్దని తహశీల్దార్ హెచ్చరిక
- అనంతరం క్షమాపణ


వాగ్వివాదం చేస్తున్న సిపిఐ నాయకులు, గ్రామస్థులు

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

మండలంలోని సత్యనారాయణపురం పంచాయితీ శ్రీకనకదుర్గమ్మ కొండ కింద బుధవారం నిర్వహించిన 5వ విడత జన్మభూమి కార్యక్రమం రసాభాసగా మారింది. జన్మభూమి కార్యక్రమానికి హాజరైన అధికారులు సభ మొత్తం చంద్రన్నబాబు భజన చేస్తుండడంతో గ్రామస్థులు ఉపన్యాశాలను అడ్డుకున్నారు. గడిచిన నాలుగు జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న పెన్షన్లు, రేషన్‌కార్డులు నేటికి మంజూరు కాలేదని, మూలపేట గ్రామంలో ఆక్రమణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసినా అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌పిసిలు ఇప్పించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆరు రోజులు దీక్ష చేసినా తహశీల్దార్ స్పందించలేదని సభలో గ్రామస్థులు నిలదీశారు. సమస్యలు పరిష్కారం చేయని జన్మభూములు ఎన్ని నిర్వహించినా అర్థం ఏముంటుందని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. దీనికి తహశీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ ఏదోలా ఆందోళనలు చేసి పేపర్లలో ఫోటోలు వచ్చేలా వ్యవహరించడం అలవాటు అయిపోయిందని, గ్రామస్తులకు నాయకత్వం వహించిన సిపిఐ, బిఎస్‌పి నాయకులపై విరుచుకుపడ్డారు. గొడవలు చేసేందుకు ఇది వేదిక కాదని హెచ్చరించారు. దీంతో తహశీల్దార్ వైఖరికి సిపిఐ నాయకులు కోనా లక్ష్మణ్, బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, పి.రాజు, గ్రామస్థులు తహశీల్దార్ తీరుకు నిరసనగా నినాదాలు చేయడంతో పొరపాటును గ్రహించిన తహశీల్దార్ క్షమాపణ కోరారు. అనంతరం సభలో రసాభాసా చేస్తున్నారన్న కారణంగా సభలో నుండి గ్రామస్థులను పోలీసుల సహాయంతో సభా ప్రాంతం నుండి గెంటివేశారు.

ప్రజా సమస్యలపై జన్మభూమిలో నిలదీయండి : బాలకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

సమస్యలపై ప్రజలు జన్మభూమిలో అధికారులను ప్రజా ప్రతినిధులను నిలదీయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అట్టహసంగా ప్రారంభించిన జన్మభూమి, మాఊరి సభలను టిడిపి సభలుగా దిగజార్చడం దారుణమన్నారు. బాధ్యత గల ఎమ్మెల్యేలు, రాజ్యాంగంపై చేసిన ప్రమాణాలను సైతం ఉల్లంఘించి సొంత పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వ అధికారులను వాడుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని వేదికలపైకి ఎక్కించి బాధ్యత గల అధికారులను కింద కూర్చోబెట్టి సభలు నిర్వహించడం ప్రజలు హర్షించడం లేదని చెప్పారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారికి అవకాశం లేకుండా చేయడం బావ్యం కాదన్నారు. అర్హులైన వారికి సంక్షేమా పథకాలు వర్తింపజేయాలని, అందుకు ప్రజలతా జన్మభూమి సభలకు వచ్చే అధికారులను, అధికార పార్టీ నేతలను నిలదీయాలని కోరారు.

డిఎ బకాయి చెల్లించాలి

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రెండు విడతల బకాయిలు, 11 నెలల పిఆర్‌సి బకాయిలు పండగ లోపు చెల్లించాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి శాస్త్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ పేరివిజన్ చైర్మన్ నియామకం చేపట్టి అందుకు తగిన ప్రతిపాదనలు సిద్దం చేసి సకాలంలో పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. ఎగవేయాలనే తప్పుడు ఆలోచనతో ఉండడం సరికాదన్నారు. ఉద్యోగ, పెన్షనర్ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

లారీలపై టార్పాలిన్లు లేకుంటే ఆపేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అసకపల్లి రోడ్డు నుండి పరవాడ వెళ్తున్న బొగ్గులారీలకు తార్పాలిన్లు లేకుంటే వెంటనే ఆయా గ్రామ ప్రజలు అడ్డుకొని నిలిపివేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. బుధవారం అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులో పైడివాడ అగ్రహారం గ్రామ వద్ద ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బొగ్గులారీలను అడ్డుకొని లోడుపైన తార్పాలిన్లు కప్పుకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, వాటిని సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ఇకపై తార్పాలిన్లు లేకుండా గ్రావెల్ లారీలు గాని, బొగ్గు లారీలు గాని వస్తే ఆయా గ్రామస్థులు నిలిపివేసి పోలీసులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైడివాడ అగ్రహం సర్పంచ్ దాసరి వెంకటరమణ, ఎంపిటిసి అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గినాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.


బొగ్గు లారీలను అడ్డుకున్న ఎమ్మెల్యే

సాంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత

అనకాపల్లిటౌన్ : దేశ సంస్కృతి సంప్రదా యాలను కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఉత్తరకోస్తా ధర్మప్రచారక్ రేజేటి నర్సింహాచార్యులు అన్నారు. బుధవారం స్థానిక దేమునిగుమ్మం రామాలయంలో ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా డివిజన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయాల్లో పెద్ద పండుగల్లో సంక్రాంతి ముఖ్యమైందన్నారు. అలాగే మహిళలకు ముగ్గుల పోటీలు పెట్టి పండుగలపై అవగాహన కల్పించాలన్నారు. యువకులకు యువజనోత్సవాలు, 26న భారతమాత పూజ, 22న శ్రీ పంచమి రోజున సరస్వతి పూజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల ధర్మప్రచారక్ ఎల్ఎస్ఎన్ మూర్తి, జిల్లా సమితి సభ్యులు గంగుపాం నాగేశ్వరరావు, డివిజన్ ధర్మప్రచారక్ ఎ గంగాధర్, మహిళా ప్రతినిధులు రాజేశ్వరీ, లలిత, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయితీ పరిధిలోని చిన గొల్లలపాలెంలో ఐదవ విడత జన్నభూమి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు ప్రజారోగ్యంపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డివైఎన్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి గ్రామ కమిటి అధ్యక్షుడు పల్లా తాతారావు మాట్లాడారు. ముఖ్యంగా యువత దుర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సూచించారు. అలా చేస్తే రోగాల నుంచి మనల్ని మనం రక్షించు కోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపాలనాయుడు, జయలక్ష్మి, చంద్రమౌళి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్ సత్యప్రసాద్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి- పరవాడ

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథదాసు అధ్యక్షతన సావిత్రిబాయ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ పరవాడ శాఖ, ఉపాధ్యాయ బృందం, జెడ్‌పిహెచ్ఎస్ ఉపాధ్యాయ బృందం నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పరవాడ అధ్యక్షులు జె విజయబాబు మాట్లాడుతూ భారత దేశంలో మొదటి మహిళా పాఠశాలను, వితంతు గర్భిణీలకు ప్రత్యేక ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ నాయకులు ప్రకాశ్, రామునాయుడు, ఆలి, శాంతకుమారి, ఫ్లోరెన్స్, అనిత, నిర్మలా కుమారి, రోజా, చైతన్య, విజయకుమార్, జెడ్‌పిహెచ్ఓస్ ఉపాధ్యాయులు దుర్గాభవాని, ప్రశాంతి, పుష్పవల్లి, సుమలత, నాగమల్లి, ఎస్ సుధారాణి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెట్టి యల్లమంద

అనకాపల్లి : పట్టణంలోని సావిత్రిబాయ్‌పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ గవరపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, అట్టలను పంపిణీ చేశారు. మెట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయ్ పూలే చేసిన కృషిని కొనియాడారు. నేటి విద్యార్థులు యువతీయువకులు సావిత్రిబాయ్ పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం : పట్టణంలోని బాలిల హాస్టల్‌లో జనవిజ్ఞాన వేదిక, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు జెట్టి యల్లమంద మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని జాతీయ మహిళా దినంగా ప్రకటించాలని కోరారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మహిళలపై ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఐద్వా డివిజన్ కార్యదర్శి గౌరి, పౌర సంక్షేమ సంఘం నాయకులు జోగి నాయుడు, హాస్టల్ వార్డెన్ శిరీష పాల్గొన్నారు. అనంతరం ఇద్దరు బాలికలకు జోగినాయుడు ఆర్థిక సహాయాన్ని అందించారు.


బోనస్‌లు అందిస్తున్న విశాఖ డెయిరీ అధికారులు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం విసన్నపేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా 120 మంది పాడి రైతులకు రూ.2లక్షల 94వేలు నగదుని బోనస్‌గా పంపిణీ చేశారు. అలాగే జనశ్రీ ద్వారా మరణించిన కంఠంరెడ్డి బాబూజీ కుటుంబ సభ్యులకు రూ.30వేలుకి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు చిదిరెడ్డి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ చిదిరెడ్డి శ్రీనువాసరావు, డెయిరీ జోనల్ ఆఫీసర్ నక్కా నాగశ్వరరావు, సూపర్‌వైజర్లు ఎస్ రాంబాబు, మాజీ సర్పంచ్ గొల్లవిల్లి లక్ష్మి, కొండలరావు, మండే శ్రీను, వేతన కార్యదర్శి కె ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రీజనల్ కమిటి నాయకులు పివిఓల్ బాబు, డిపో నాయకులు బివిఎస్ నారాయణ, జి సాయిబాబు కుమార్ మాట్లాడారు. కొద్ది రోజులుగా కార్మికులకు సెలవులు ఇవ్వడం లేదని అలాగే 20శాతం హెచ్‌ఆర్ ఎరియర్స్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో యూనియన్‌కు లీవ్ కోటాను రద్దు చేసి కార్మికులకు అందరికి సమానంగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గవర్నమెంట్ సిక్కీపై జీతాలు ఇప్పించాలని, ఆఫ్‌లో డ్యూటీ చేసిన వారికి డ్యూఆఫ్ ఇప్పించాలన్నారు. అధికారులు, యూనియన్ పక్షపాత వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కరారు. ఈ కార్యక్రమంలో డిఎస్ మూర్తి, వైవిఎస్ కుమార్, గ్యారేజ్ కమిటి ఆర్‌వి రమణ, రమణ పాల్గొన్నారు.

రైతు రథంలో 634 ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో రైతు రథం పథకంలో భాగంగా ఇప్పటి వరకు 634 ట్రాక్టర్లు పంపిణీ చేశామని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త లంచాలకులు శివప్రసాద్ అన్నారు. బుధవారం సోమవరం గ్రామంలోని జరిగిన జన్మభూమి కార్యక్రమం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి వ్యవసాయ కేంద్రంలో సబ్సిడీపై పనిముట్లను అందిస్తుందన్నారు. అలాగే రైతులకు సంబంధించిన జమును, పెసలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- మునగపాక

మండల కేంద్రమైన మునగపాకలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆలయం భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులకు వెలవలపల్లి కోటేశ్వరస్వామి తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయితే ఆలయ ప్రాంగణంలో ముస్లింకు చెందిన అజరత్ అనే బాలిక తన మధుర గీతాలతో ఆకట్టుకుంది.

ఐదుగురు పేదలకు కంటి ఆపరేషన్లు

అనకాపల్లి : పట్టణంలోని వర్తక సంఘం ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో ఉన్న కంటి ఆసుపత్రిలో నందు బుధవారం 50 మంది పేదలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో అవసరమైన వారిని గుర్తించి ఐదుగురికి ఐఒఎల్ ఆపరేషన్లను డాక్టర్ మంజుల చేతుల మీదుగా నిర్వహించారు. వీరికి అవసరమైన కంటి అద్దాలను, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బుద్ద రమణాజీ, కంటి ఆసుపత్రి చైర్మన్ వి రవిరామ్ జోహర్, మళ్ల సూరిబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

పేదలకు సంక్షేమ పథకాలు

'జన్మభూమి'లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


అచ్యుతాపురంలో రేషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే


నక్కపల్లిలో అన్నప్రాసన చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- అచ్యుతాపురం

పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కొనియాడారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలో బుధవారం దిబ్బపాలెం, జంగులూరు, అచ్యుతాపురం పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు రుణాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజన రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ బలరాముడు, సర్పంచ్‌లు బైలపూడి రామదాసు, లాలం నాగేశ్వరరావు, పిళ్లా సతీష్, దేశంశెట్టి శంకరరావు, మండల ఇంజినీర్ సోమశేఖర్, మండల వ్యవసాయాధికారి వీరుకొండ నర్సింగరావు, బి.లక్ష్మీ భవాని పాల్గొన్నారు.


ఎస్‌రాయవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ

నక్కపల్లి : మండలంలో దేవవరం, రేబాక, బంగారమ్మ పేట, దొండకాడ, రమణయ్యపేట, గునుపూడి గ్రామాల్లో ఎపిడిఒచ తహశీల్దారు, ఇఒపిఆర్డీలు బృందాలుగా ఏర్పడి జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దేవవరం గ్రామంలో ఎంపిడిఒ పిడుగు ఉమా మహేశ్వరరావు లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, స్కాలర్ షిప్పులు, పింఛన్లు అందజేసారు. దొండకాడ గ్రామంలో ఎంపిడిఒ పిడుగు ఉమామహేశ్వరరావు నలుగురు చిన్నారులకు అన్నప్రాసనను నిర్వహించారు. బంగారమ్మపేటలో ఇఒపిఆర్డీ పిఎస్ కుమార్ రేషన్ కార్డులు, స్కాలర్ షిప్పులు, సంక్రాంతి చంద్రన్న కానులు అందజేసారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ ఇవ్వాలని రైతులు తెలిపారు. మత్స్యశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ, ఆక్వా క్వారంటైన్ ల్యాబ్ నిర్మాణ పనులను త్వరలో చేస్తామని తెలిపారు. రేబాక, రమణయ్యపేటలో తహశీల్దార్ రాణి, ఐసిడియస్ పిఒ శారదాదేవి గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని దార్లపూడి, పెదగుమ్ములూరు, తిమ్మాపురం గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. దార్లపూడిలో ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. రెల్లి కాలనీలో వీధి లైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పెదగుమ్ములూరులో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తిమ్మాపురంలో జరిగిన జన్మభూమి సభలో గోకులపాడుకు నిధులు ఇవ్వక పోవడంతో వాగ్వివాదం చోటే చేసుకుంది. ఎమ్మెల్యే అనిత కలుగజేసుకొని గోకులపాడు గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాలని పాలకవర్గాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వినోద్‌రాజు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, అమరావతి నుండి వచ్చిన ఐపిఎస్ అధికారి రవి, అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచరును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- అచ్యుతాపురం

స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం జరగే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. మండలకేంద్రంలో బుధవారం సదరం క్యాంపు బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ క్యాంపునకు సంబంధిత వైద్య నిపుణులు హాజరు వుతారన్నారు. వైద్య నిపుణులు ఇచ్చిన వికలాంగ వైద్య ధ్రువపత్రాలతో పింఛన్లు మంజూరు అవుతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు రాజాన రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పిళ్ల సతీష్, లాలం నాగేశ్వరరావు, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ పి బలరాముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- అచ్యుతాపురం

హరిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గ్రామ పెద్దలు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.జగదీశ్వరరావు, పాఠశాల కమిటి చైర్మన్ పి.గోవిందరాజు, ఎంపిటిసి పెంటకోట భారతి నాయుడు, పొలమరశెట్టి సోమునాయుడు, ఆవనీటి సంఘం అధ్యక్షుడు మారిశెట్టి అప్పల నాయుడు, 3వ వార్డు మెంబరు మత్తుర్తి శ్రీనివాసరావు, టిడిపి మండల ఉపాధ్యక్షులు కాండ్రేగుల రమణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సిబ్బంది

గ్రిక్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నక్కపల్లి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8వ జోన్ గ్రిక్ స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబరిచారు. హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మావతి మాట్లాడుతూ, 8వ జోన్ గ్రిక్ స్పోర్ట్స్ ఆటల పోటీలలో 9 క్రీడాంశాలలో విద్యార్థులు పతకాలను సొంతం చేసుకున్నారని తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో ఆల్ రౌండ్ చాంపియన్ షిప్ కైవశం చేసుకున్నారని అన్నారు. అండర్ 17 విభాగంలో క్రికెట్, వాలీబాల్, అండర్-14 విభాగంలో క్రికెట్, వాలీబాల్‌లో ప్రథమ, కబడ్డీలో ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. 200 మీటర్ల పరుగు పోటీలలో మొదటి, 600 మీటర్ల పరుగులో ద్వితీయ, 100 మీటర్ల పరుగులో ద్వితీయ, డిస్కస్‌లో తృతీయ స్థానాలు సాధించినట్లు పిడి కందూరు రాజు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఆచార్యులు, బాబుజీ, అప్పారావు, రమేష్ చౌదరి పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులతో సిబ్బంది

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

ప్రజాశక్తి- అచ్యుతాపురం

సావిత్రి భాయ్ పూలే జయంతి సందర్భంగా మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.చంద్రిక సావిత్రిభాయ్ పూలే వేషధారణలో ఆకట్టుకుంది. ఉపాధ్యాయురాలు విహెచ్ నళిని సత్కరించారు. పూలేపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో రొంగలి రాంబాబు, టివి సత్యనారాయణ, విహెచ్ నళిని, మారిశెట్టి వెంకట అప్పారావు, కొణతాల సోమశేఖర్, వి.విజయ్ పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లి, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి భాయ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం జి.వి.ఎస్.పద్మావతి, భవానిలను సిబ్బంది సత్కరించారు. హెచ్‌ఎం పద్మావతి మాట్లాడుతూ, అట్టడుగు వర్గం నుండి వెలుగొందిన సామాజిక ఉద్యమకారి సావిత్రి భాయే పూలే అని అభివర్ణించారు. వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాసు ఆధ్వర్యంలో జయంతి వేడుకల ఏర్పాటు చేశారు. తెలుగు ఉపాధ్యాయుని వరలక్ష్మి ఆధ్వర్యంలో పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లిలో మాట్లాడుతున్న హెచ్‌ఎం


అచ్యుతాపురంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది


ఎంపిపికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - ఎస్.రాయవరం

మండలంలోని జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని తిమ్మాపురంలో ఎంపిపి వినోద్‌రాజుకు విద్యార్థులు బుధవారం వినతిపత్రం అందించారు. జన్మభూమి మాఊరు కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు కిశోర బాల బాలికల సంఘాలైన వివేకానంద, సరస్వతి గ్రూపులకు చెందిన విద్యార్థులు అందజేశారు. 28 పంచాయతీలకు సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి చదువు తున్నారన్నారని తెలిపారు. వీరిలో ఆర్థికంగా వెనుకబాటుతో ఉన్నవారే అధికంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేనందున ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకోలేక చాలా మంది విద్యార్థినులు, విద్యార్థులు పదవ తరగతితోనే చదువు ఆపేస్తు న్నారన్నారు.

వరి కుప్ప దగ్ధం

ప్రజాశక్తి - ఎస్.రాయవరం

మండలంలో గుడివాడ శివారు గుర్రాజుపేట గ్రామంలో బుధవారం వరి కుప్ప దగ్ధమైంది. బాధితుడు, గ్రామ సర్పంచ్ కురందాసు శ్రీనివాస్ అందించిన వివరాలు ప్రకారం.... వరి కుప్ప మంటలకు కాలి పోతున్నట్లు గ్రామస్తులు సమాచారం ఇచ్చారన్నారు. వెళ్లి చూడగా అప్పటికే వరి కుప్ప పూర్తిగా కాలి పోయినట్లు తెలిపారు. తన పై కక్షతోనే వరి కుప్ప దగ్ధం చేసినట్లు గ్రామస్తులు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.


వరి కుప్పను పరిశీలిస్తున్న గ్రామస్తులు

శరవేగంగా డ్రెయిన్ల నిర్మాణం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామంలో డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో కొప్పిశెట్టి వారి వీధిలో ప్రధాన సమస్యగా ఉన్న మరుగునీటి పారుదల వ్యవస్థ ప్రక్షాళనే ధ్యేయంగా గ్రామ సర్పంచ్ భర్త వియ్యపు వరహాలరావు పట్టుదలతో గ్రామస్తులను ఒప్పించి కాలువల నిర్మాణం చేపట్టారు. డ్రెయిన్ల నిర్మాణానికి రూ.2 లక్షలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలను మంజూరు చేశారు. ఈ ఎన్‌ఆర్‌జిఎస్ నిధులు రెండేళ్ల క్రితం మంజూరవ్వగా గ్రామంలో వివిధ గ్రూపుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తడంతో ఆగిపోయింది. సర్పంచ్ పదవీ విరమణ కాలం ముగిసి పోతుండడంతో నిధులు వెనక్కి పోతాయని గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు విభేదాలు వీడి స్వచ్ఛందంగా డ్రెయిన్ల నిర్మాణానికి సహకరించడంతో పారిశుధ్య సమస్య తొలగి పోయింది. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.6 లక్షలు అవుతుందని, మిగిలిన లక్ష రూపాయలు పంచాయతీ నిధుల నుండి తీయనున్నట్లు తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ దగ్గరుండి పని సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.


నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

ఘనంగా సిపిఐ రెండవ మహాసభలు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్

ఐడియల్ నర్సీపట్నంలో సిపిఐ రెండవ మహాసభలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకన్య థియేటర్ నుండి కషా బజార్ వరకూ, అక్కడి నుండి అబిద్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అబిద్ సెంటర్ లోగల ఎంజివోస్ సమావేశ మందిరంలోనిరెడ్డి రాజబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి మాట్లాడారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ అనే ప్రచారాలకే పరిమితమవుతున్నాయని ఎద్దేవా చేశారు. జిఎస్‌టి విధానాన్నే పెట్రోలుపై ప్రవేశపెడితే రూ.40 పెట్రోలు వస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జన్మభూమి కమిటిలు నిజమైన అర్హులకు కాకుండా తమ కార్యకర్తలకు తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇవ్వడం వలన నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. స్టాలిన్ మాట్లాడుతూ ఈ నెల 9 10 11 తేదీల్లో బాడీలో జరిగే జిల్లా మహాసభలకు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముందు పాలూరు వెంకట స్వామి సిపిఐ సీనియర్ కార్యకర్త చేతులమీదుగా పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, పఠన కార్యదర్శి రూత్తల పెద్ద బుజ్జి , జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఏ విమల, రావు జగ్గారావు, మూకిరెడ్డి రామునాయుడు, డిసిహెచ్ రాజబాబు ,రాజాన దొరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

బహిరంగ సభను జయప్రదం చేయాలి

గొలుగొండ : అచ్యుతాపురంలో ఈ నెల 6న నిర్వహించనున్న సిపిఎం బహిరంగసభను జయప్రదం చేయాలని సిపియం గొలుగొండ మండల కార్యదర్శి సాపిరెడ్డి నారాయణమూర్తి కోరారు. బుధవారం మండలంలోని బుడ్డడుపాడు గ్రామంలో సిపియం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యల కోసం సిపిఎం ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. సిపియం జిల్లా బహిరంగ సభను విజయవంతం చేయడానికి అందరూ తరలి రావాలన్నారు. ముందుగా కార్యవర్గ సభ్యులంతా బహిరంగసభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ నాయకులు ఆర్.ఎ. నాయుడు, రామకృష్ణ, రాజుబాబు, రమణమ్మ, భవాని పాల్గొన్నారు.

పేదలకు 300 చీరలు పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పుల వీధిలో కళ్యాణ మండలంలో బుధవారం రామచంద్ర చారిటబుల్ ట్రస్టు ప్రారంభించి నేటికి 22 ఏళ్లైన సందర్భంగా పేదలకు 300 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడిమిశెట్టి శ్రీరాములు(రాంజీ) మాట్లాడారు. రామచంద్రమూర్తి చేసే ప్రతి కార్యక్రమంలో తనను భాగస్వామిన్ని చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేల్పుల వీధి పెద్దలు నల్లల ముత్తా ఈశ్వరరావు, గరిక వెంకటరావవు, మద్దాల కూర్మారావు, డి రామారావు, నల్లల దేముళ్లు, పళ్లా గోపాలకృష్ణ, వాకాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

థింసా నృత్యానికి విశేష స్పందన

అనకాపల్లి :అనంతపురంలో జరుగుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను విశాఖ పట్నం గిరిజన ప్రాంతాలనికి దింసా నృత్య కళాకారులు ఉత్సాహంగా ప్రదర్శన చేశారు. ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి బుద్ద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజన కళాకారులు అనంతపురం ప్రదర్శనల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రదర్శనకు విశాఖ గిరిజన కళాకారుల దింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలచింది.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

అనకాపల్లిటౌన్ : సామాజిక విప్లవకారిని సావిత్రిబాయ్ పూలే 186జయంతి వేడుకలు బుధవారం మండలంలోని సత్యనారాయణ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రి బాయ్ పూలే అంటరాని తనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారని, అనాథ పిల్లలు కోసం శరణాలయాలు స్థాపించారన్నారు. నేటి యువత పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి జన సభ కోకన్వీనర్, స్కూల్ కమిటి చైర్మన్ కోనా లక్ష్మణ్, రాష్ట్ర రిజర్వేషన్ పోరాట సమితి యువజన విభాగం నాయకులు వాయబోయిన శేఖర్‌యాదవ్, బిసి సంఘాల నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి కృష్ణంరాజు, ఉపాధ్యాయులు తులసీలక్ష్మి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి 5కె రన్

నర్సీపట్నం : నర్సీపట్నంలో ఈనెల 7న జరగనున్న జిల్లా స్థాయి 5కె రన్ విజయవంతం చేయాలని నర్సీపట్నం ఆర్‌డిఓ కె.సూర్యారావు ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్మభూమిలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ మినీ స్టేడియం, పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల మధ్య పోటీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సెట్విస్ సిఇఒ వెంకటేశ్వరరావు, డిఎస్‌డిఒ జూన్ గేలియట్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సీపట్నం రూరల్ : ధర్మసాగరం గ్రామంలో శుక్రవారం జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులంతా కషిచేయాలని జిల్లా కలెక్టరు ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మసాగరం గ్రామంలో గ్రామసభ జరిగే ప్రాంతంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించే ప్రాంతంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామంలో జరిగిన అభివ ద్ధిని వివరించాలని, లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, చంద్రన్న భీమా కార్డులు పద్ధతి ప్రకారం క్రమశిక్షణతో అందజేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెళ్లిన అనంతరం రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ, డిఆర్‌డిఎ పీడీ సత్య సాయి శ్రీనివాస్, డ్వామా పిడి కళ్యాణ చక్రవర్తి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ చిన్మయి దేవి, డిప్యూటీ డిఇఒ సునీత, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు, పర్యాటక సమాచార అధికారి పూర్ణిమ మండల ప్రత్యేక అధికారి సిహెచ్ మహాలక్ష్మి, ఎంపిపి సుకల రమణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారం అందించేందుకే జాబ్ కార్డులు

గొలుగొండ : కూలీలైనా, అధికారులు అయినా పూర్తి సమాచారం తెలుసుకునేందుకే కొత్త జాబ్‌కార్డులను ప్రభుత్వం అందిస్తుందని టిడిపి జిల్లా యూత్‌సభ్యులు తుమ్మగుంట అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలో పుత్తడిగైరంపేట గ్రామంలో 425 మందికి జాబ్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌కార్డుల వలన కూలీలు పనిదినాలు, తీసుకున్న కూలీసొమ్ము వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పత్తి రమణ, విఆర్‌పి రాజేశ్వరి, గ్రామపెద్దలు పత్తి సత్తిబాబు, రూపల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా జన్మభూమి

ప్రజాశక్తి- కోటవురట్ల

మండలంలో జరుగుతున్న జన్మభూమి మాఊరు పండుగలా జరుగుతుందని అంచనా వేసిన ఉత్తి దండగలా జరుగుతుందని ప్రజలు ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. బుధవారం కొత్తపల్లి రామచంద్రపాలెం, నీలిగుంట, బోడపాలెం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి, రామచంద్రపాలెం గ్రామాల్లో ప్రత్యేక అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరగ్గా, నీలిగుంట, బోటపాలెం ఎంపిడిఒ కళ్యాణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తపలిట్ల కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి పుష్పమణి హజరయ్యారు. ప్రస్తుతం అందిస్తున్న డ్వాక్రా మహిళల రుణాలకు అధికంగా వడ్డీలు వసూలు చేస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అయా గ్రామాల సభల్లో ఎంపిపి వరహాలమ్మ, జెడ్‌పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బికె పల్లి సర్పంచ్ సత్యవతి, ఉప సర్పంచ్ బాబులు, సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాంబాబు, రామచంద్రపాలెం సర్పంచ్ రాము, నీలిగుంట సర్పంచ్ సత్తిబాబు, బోడపాలెం సర్పంచ్ రాజేశ్వరి, ఆయా గ్రామాల ఎంపిటిసి సభ్యులు, తహశీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ సీతంనాయుడు, వైఎస్‌ఆర్ సీనియర్ నాయకులు రాజులనాయుడు పాల్గొన్నారు.

కశింకోట : జన్మభూమితో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని జె.తుని, సోమవరం గ్రామాల్లో బుధవారం ఐదవ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సోమవరం గ్రామంలో రూ.90లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివప్రసాద్, జన్మభూమి మండల ప్రత్యేక అధికారి గీతాదేవి, జెడ్‌పిటిసి సభ్యులు మలసాల ధనమ్మ, ఎంపిపి పంచదర్ల లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎఎంసి చైర్మన్ కాయల మురళీ, వేగి గోపీకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ గొంతిన శ్రీనివాసరావు, సర్పంచ్ నాగరత్నం పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీలా

మునగపాక : మండలంలో రాజుపేట, పాటిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. పాటిపల్లి జన్మభూమి కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వర్గపోరు విభేదాలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి పథకంలో నడిపేందుకు అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చూడాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించి విద్యార్థులను అభినందించారు.

సబ్బవరం : అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఎన్‌టిఆర్ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని నల్లరేగులపాలెం, నారపాడు, తవ్వవానిపాలెం, అమృతపురం పంచాయితీల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తవ్వవానిపాలెంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. లబ్దిదారులకు చంద్రన్న బీమ చెక్కులను, కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లను, సంక్రాంతికి చంద్రన్న కానుక సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఇసిఎస్ చైర్మన్ కొటాన అప్పారావు, టిడిపి మండలాధ్యక్షుడు ఎం.మహాలక్ష్మినాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు, టిడిపి నేతలు కె రామకృష్ణరాజు, రొంగలి శ్రీనివాసరావు, అమృతపురం ఎంపిటిసి సింగంపల్లి వరలక్ష్మి, శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం అప్పలనాయుడు, ఎంపిటిసి బోకం అర్జునుడు, తహశీల్దార్ పైలా రామారావు, మండల ప్రత్యేక అధికారి కెఎస్ శాస్త్రి, ఎంపిడిఒ షేక్‌బాబూరావు, ఐసిడిఎస్ పిఒ కె శ్రీగౌరీ, అమృతపురం సర్పంచ్ గండి రమణమ్మ, ముత్యాల నాయుడు, జెడ్‌పిటిసి సత్యనారాయణ, బుచ్చిరాజు పాల్గొన్నారు.

నాతవరం. : ప్రజలకు సంక్షేమాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయంగా పని చెస్తుందని జెడ్.పి.టి.సి కరకసత్యన్నారాయణ అన్నారు. బుదవారం జిల్లేడిపూడి, చెర్లొపాలెం, శృంగవారం, గాంధీనగరం, గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకరావు, ఎంపిడిఒ యాదగిరీశ్వరావు, జడ్.పి.టి.సి కరకసత్యాన్నారాయణ, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గున్నారు.

అనకాపల్లిటౌన్ : మహిళలకు పురుషులతో పాటు సమానంగా ఆస్థిహక్కును కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్‌టిఆర్ కే దక్కుతుందని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక వేల్పుల వీధి కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన ఐదవ విడత జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ షేక్ సుభాని, ఇఇ ఉదయ్‌కుమార్, టిపిఆర్‌ఒ రజని, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, అర్బన్ ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, డాక్టర్ కె సత్యవతి, కె విష్ణుమూర్తి, బిఎస్‌ఎంకె జోగినాయుడు, కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత....

బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 23వ వార్డు వాసి బెన్నాబత్తుల బ్రహ్మాజీకి రూ.2లక్షల 50వేల సిఎం సహాయనిధి చెక్కును బుధవారం ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అందజేశారు.

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం 5, 6, 7 వార్డులో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషన్ సురేంద్ర మాట్లాడారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటిలో భాగంగా చంద్రన్న బీమా చెక్కులు, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఇ రంగ కామేశ్వరరావు, కౌన్సిలర్లు రావాడ నాయుడు, ఆడారి రమణమ్మ, గానుగల శైలజ, రమణబాబు, రుత్తల కృష్ణ, వివిధ శాఖ కారులు పాల్గొన్నారు.

అధికారులు ఊకదంపుడు ప్రసంగాలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని పలువురు విమర్శలు కురిపించారు. పింఛన్ల పంపిణీ జరగలేదు. పించన్ల మంజూరుకు అక్రమాలు జరిగాయినే నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి అధికారులు ఎవరికీ ఫించను సొమ్ము అందజేసిన దాఖలా లేదు.



వాల్‌పోస్టరును విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

కలెక్టరేట్ : అచ్యుతాపురంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభలను, 6వ తేదీన చేపట్టే బహిరంగ సభను జయప్రదంచేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, బి.ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మహాసభల ప్రారంభం రోజైన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభలో పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర నాయకులు సిహెచ్.నరసింగరావు, డాక్టర్ మిడియం బాబూరావు పాల్గొంటారని చెప్పారు. జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్లిష్ట రాజకీయాలలో విలువలు, నిబద్ధత, క్రమశిక్షణ, అవినీతికి తావులేని పార్టీగా సిపిఎం నిలిచిందన్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి, కార్మిక, కర్షక, ప్రజా పక్షపాతిగా ప్రజాసేవలో నిస్వార్థంగా అవిరళ కృషి చేస్తుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, అన్ని వర్గాల ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరు సలుపుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసిన ప్రతి సందర్భంలోనూ పార్లమెంట్‌లోను, బయట సిపిఎం ఆధ్వర్యాన పోరాటాలను చేపడుతుందని తెలిపారు. ప్రజా పోరాటాలతోపాటు ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అనేక రూపాల్లో సిపిఎం తన సేవా కార్యక్రమాలను జిల్లా వ్యాపితంగా నిర్వహిస్తుందన్నారు.

డిసిఐ ప్రయివేటీకరణపై 5న ప్రజా బ్యాలెట్

కలెక్టరేట్ : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణను నిరసిస్తూ నగరంలోని 200 సెంటర్లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, కార్మిక, ప్రజా కూడళ్ల వద్ద శు క్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'ప్రజా బ్యాలెట్'ను నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు చెప్పారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రజా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సీహార్స్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న డిసిఐ దీక్షా శిబిరంలో శనివారం లెక్కింపు చేపడతామని తెలిపారు. అనంతరం సభ ఉంటుందని చెప్పారు. ఈ సభకు సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. విశాఖ అఖిల పక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల నాయకులు పాల్గొంటారని చెప్పారు. నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజానీకం పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ, డిసిఐ ప్రయివేటీకరణను బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. స్థానిక బిజెపి ఎంపీ కంభంపాటి హరిబాబు డిసిఐ ప్రయివేటీకరణపై విశాఖ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 5న జరిగే ప్రజా బ్యాలెట్‌లో నగర ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

గొప్ప హేతువాది సుబ్బారావు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు

ప్రజాశక్తి- మద్దిలపాలెం

కుటుంబ సభ్యులందరికీ కులాంతర వివాహాలు జరిపిన గొప్ప హేతువాది సుబ్బారావు అని, ఈయన్ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. నగరంలోని శివాజీపాలెంలో బుధవారం సిపిఎం అధ్వర్యాన కుంచం సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి సిపిఎం, సిఐటియు నాయకులు, యూనివర్సిటీ ఉద్యోగులు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావుపై ప్రజానాట్య మండలి సభ్యులు చంటి రాసిన గేయాన్ని చిన్నారి, కుమారి ఆలపించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.మణి అధ్యక్షతన జరిగిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ, నమ్ముకున్న సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడిన నిబద్ధతగల వ్యక్తిని కొనియాడారు. తన కుటుంబాన్నంతటినీ పార్టీకే అంకితం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ పదవులు నిర్వహించనప్పటికీ పార్టీలో కీలకంగా పనిచేశారని, ఆయన జీవితంలోని అన్ని కోణాలూ ఆదర్శమేనని అన్నారు. సోషలిజంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా విశ్వసించిన వ్యక్తి అని పేర్కొన్నారు.

సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తూ ఉద్యోగ సంఘాలు, సిఐటియు ఉద్యమాలు, ప్రజానాట్య మండలి, పార్టీ



సుబ్బారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న గంగారావు

కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ అంకిత భావంతో పనిచేసిన గొప్పవ్యక్తని కొనియాడారు. యూనివర్సిటీ హాస్టల్‌లో ఉదారంగా పనిచేసి విద్యార్థుల మన్ననలందుకున్నారన్నారు. కుటుంబాన్నంతటినీ పార్టీ చేతుల్లో పెట్టి ఆదర్శవంతుడుగా మిగిలారని, జ్యోతిబసు దేహదాన ట్రస్టుకు శరీరాన్ని దానం చేసిన తొలి వ్యక్తి అని పేర్కొన్నారు.

పెట్రోలియం యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య వివిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ, సుబ్బారావుతో తనకు 30 ఏళ్ల నుంచి పరిచయముందని, తన భావాలను సున్నితంగా చెప్పేవారని పేర్కొన్నారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పద్మనాభరాజు మాట్లాడుతూ, ఆయన మన మధ్యలో లేకపోయినా మన మదిలోనే ఎల్లప్పుడూ ఉంటారని అన్నారు. ఎప్పుడు, ఎక్కడ పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు జరిగినా పాలుపంచుకునే వారని పేర్కొన్నారు.

ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎస్.సుధాకర్ మాట్లాడుతూ ఎయు యూనియన్ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసేవారని తెలిపారు. ఎటువంటి పదవులూ ఆశించకుండా చివరివరకూ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. అనంతరం సుబ్బారావు సహచరులు పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఆర్‌ఎస్‌ఆర్. దేవుడు, రఘునాథ పాత్రో తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు వందన సమర్పణ చేశారు.

మేము సైతం..

సుబ్బారావు సతీమణి రమణమ్మ, పెద్ద కుమార్తె సుజాత, పెద్దల్లుడు శంకరరావు తన శరీరాలను పరిశోధనలకు ఉపకరించేవిధంగా మరణానంతరం దానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దరఖాస్తు పూర్తి చేసి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మరణానంతరం దేహాన్ని కాల్చితే బూడిదే మిగులుతుందని, దానం చేయడం వల్ల పరిశోధనలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

అట్టహాసంగా మేజర్ పోర్టు క్రీడలు

విశాఖ : స్థానిక పోర్టు స్టేడియంలో బుధవారం ఆలిండియా మేజర్ పోర్టు క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ 2018 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఐఆర్‌టిఎస్ డిప్యూటీ చైర్మన్ పిఎల్ హరినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఉత్తేజాన్ని కూడా కలిగిస్తాయన్నారు. కొన్ని క్రీడలు శారీరకంగా ఆడాల్సి



ఉన్నప్పటికీ క్యారమ్స్, చెస్ మైండ్‌తో ఆడాల్సి ఉంటుందన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. తొలి రోజు విశాఖపట్నం, ఇన్నోర్, చెన్నై, ముంబయి, కండ్లా, ఎన్ఎంపిటి, కోల్‌కత్తా ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తలబడ్డారు. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు ట్రస్టు కార్యదర్శి సి.హరిచంద్రన్, మేజర్ పోర్టు స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు చీఫ్ ఇంజినీర్ ఎకె.మెహర, ఒలింపియన్ మాణిక్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం

సురభి నాటకాల డైరెక్టర్ ఆర్.నాగేశ్వరరావు (బాబ్జి)


అప్పటి రాష్ట్రపతి చేతులు మీదగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

మునగపాక : సురభి 132 సంవత్సరాల చరిత్రలో ఇంచుమించుగా 1991 వరకు చాలా కష్టాలు ఎదుర్కొన్నామని సురభి నాటకాల డైరెక్టర్ ఆర్.నాగేశ్వరరావు (బాబ్జి) చెప్పారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా మునగపాక మండల కేంద్రంలో రెండురోజులుగా సురభి నాటకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన్ని కలిసిన ప్రజాశక్తితో సురభి నాటకాల విశేషాలపై ముచ్చటించారు. ఒకే కుటుంబానికి చెందిన 70 సమాజాలున్నాయి. ఒక్కొక్క సమాజానికి 60 నుండి 70 మంది తక్కువ లేకుండా నిర్వహించుకుంటూ వచ్చాం. కాలక్రమేణా సురభి నాటకాలకు ఎంతో ఆదరణ పెరిగింది. కానీ ఆదాయం కన్న ఖర్చులు ఎక్కువ కావడంతో చాలా సమాజాలు అప్పులపాలయ్యాయి. సమాజాలు నడపడం మానేసినప్పటికీ మనోధైర్యంతో ఈ సమస్యల నుంచి గట్టెక్కెందుకు.. రాబోయే రోజుల్లో మంచి రోజులు వస్తాయనే ఆశతో కేవలం ఐదు సమాజాలు వారసత్వంగా భావించి నిర్వహిస్తున్నారు. ఈ సురభి సమాజానికి అన్ని విధాలుగా ఆర్థికంగా మాకెంతో ప్రోత్సాహం ఇస్తూ మా సురభి


పాతాళభైరవి నాటకం

సమాజానికి ఒక రూపకల్పన తెచ్చారు డాక్టర్ కెవి రమణాచారి (రిటైర్డ్ ఐఎఎస్ అధికారి). 1996లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ, స్పందన బెంగుళూర్ ఈ రెండు సంస్థల నుండి నేషనల్ స్థాయిలో భీష్మా అను నాటకానికి వర్క్ షాప్ కాంట్రాక్ట్ చేశారు. ఈ కాంట్రాక్టర్‌కు పద్మశ్రీ బివి కారంత్ నేషనల్ డైరెక్టర్ వీరు సంగీత దర్శకత్వంలో ఈ నాటకం తయారు చేయబడింది. 1997లో చండీ ప్రియ అను జానపద నాటకం, 1998లో బషీదేవతి యాదమ్మ అను సాంఘిక నాటకాన్ని వారి శిక్షణలో నేర్చుకొని


ప్యారీస్‌లో ఫొటో దిగిన సురభి కళాకారుల కుటుంబాలు

ఈ మూడు నాటకాలు కూడా భారత దేశంలో జాతీయ అంతర్‌జాతీయ స్థాయిలో ప్రదర్శించడం జరిగింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సురభి సమాజాలకు నెలనెల జీతాలు ఇవ్వడానికి ముందుకొచ్చింది. అప్పటి నుండి సురభి సమాజాలు నిలబడడానికి ఆస్కారం ఏర్పడింది. మునగపాక గ్రామానికి మూడు సమాజాల వారు (65 మంది) వచ్చారు. 13 సంవత్సరాలుగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్ తెలుగు లలిత కళాతోరణి ప్రాంగణంలో సురభి థియేటర్ నిర్మించుకుని ప్రదర్శిస్తున్నామని తెలిపారు.


పాతాళభైరవి నాటకంలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న పాతాళభైరవి నాటకం

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా రెండవ రోజు సురభి నాటకాలు కొనసాగాయి. బుధవారం పాతాళభైరవి నాటకం జనాలను ఎంతో ఆకట్టుకుంది. నాటకం ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది. సుమారుగా నాటకాన్ని తిలకించేందకు చుట్టు పక్కల గ్రామాల నుండి 5వేల మంది వచ్చారు.